జిల్లా వ్యాప్తంగా భారీవర్షాలు



రామగిరి చెరువులోకి వెళ్తున్న వర్షపు నీరు

పుట్టపర్తిరూరల్, ఆగస్టు 21: జిల్లావ్యాప్తంగా మంగళవారం రాత్రి భారీ వర్షాలు కురిశాయి. రామగిరిలో అత్యధికంగా 44.6 మిల్లీమీటర్లు, మడకశిరలో అత్యల్పంగా 2.0 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు వాతావరణశాఖ అధికారులు పేర్కొన్నారు. మిగిలిన ప్రాంతాల్లో రొళ్ల 41.2 , కనగానపల్లి 40.2, పెనుకొండ 31.4, సోమందేపల్లి 30.2, గోరంట్ల 28.0, అమడగూరు 26.2, అగళి 24.8, నల్లమాడ 22.4, పుట్టపర్తి 18.6, చిలమత్తూరు 15.4, ధర్మవరం 11.4, బుక్కపట్నం 11.2, కదిరి 10.2, చెన్నేకొత్తపల్లి 9.4, నల్లచెరువు 8.4, ఓడీసీ 8.2, బత్తలపల్లి 7.2, తనకల్లు 6.8 , కొత్తచెరువు 6.2, రొద్దం 6.0 తాడిమర్రి 5.8, అమరాపురం 4.8, లేపాక్షి 4.6 , గుడిబండ 4.4, పరిగి 3.0, ముదిగుబ్బ 2.6, హిందూపురం 2.4 మిల్లీమీటర్ల వర్షపాతం కురిసింది. కాగా జిల్లాలో సగటు వర్షపాతం 13.7 మిల్లీమీటర్లుగా నమోదైనట్లు వాతావరణశాఖ అధికారులు పేర్కొన్నారు.

అప్రమత్తంగా ఉండండి

వర్షాలపై కలెక్టర్‌ను ఆదేశించిన మంత్రి సవిత



మంత్రి సవిత

పుట్టపర్తి, ఆగస్టు21(ఆంధ్రజ్యోతి): జిల్లాతో పాటు ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలతో అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని మంత్రి సవిత ఆదేశించారు. ఆమె బుధవారం అమరావతి నుంచి జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్‌తో టెలిఫోన్‌లో మాట్లాడారు. జిల్లాతోపాటు ఎగువ న ఉన్న కర్ణాటక ప్రాంతంలో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. వర్షాభావ పరిస్థితులు నెలకొన్న సందర్భంలో మూడు రోజుగా భారీ వర్షాలు కురవడం ఆనందంగా ఉందన్నారు. నదీ తీరప్రాంతాల్లో ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు. జిల్లాలో ఎక్కడైనా పంట నష్టం వాటిల్లితే తక్షణమే ప్రభుత్వం దృష్టికి తీసుకురావాలన్నారు. రైతులకు అవసరమై విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచాలన్నారు. వర్షాలతో గ్రామాల్లో అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉంటుంది కావున ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. వర్షాల నేపథ్యంలో సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థులకు వేడి ఆహారం గోరువెచ్చని నీరు అందించాలన్నారు.

సమస్యల పరిష్కారానికే గ్రామసభలు : కలెక్టర్

పుట్టపర్తి, ఆగస్టు 21: రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనున్న గ్రామసభలను విజయవంతం చేయాలంటూ జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్ అధికారులను ఆదేశించారు. తన క్యాంపు కార్యాలయం నుంచి బుధవారం ఆయన అధికారులత టెలిఫోన్ కాన్ఫరెన్సు నిర్వహించారు. ఈనెల 23న నిర్వహించే గ్రామసభలకు ఆయా మండల ప్రత్యేక అధికారులు తప్పక హాజరుకావాలన్నారు. ప్రజా ఫిర్యాదుల వేదిక ద్వారా వచ్చిన వినతులకు సంబంధించి క్షేత్రస్థాయిలో పరిశీలించి సమస్యలకు పరిష్కారం చూపాలన్నారు. జిల్లాలో ఎక్కడా తాగునీటి పైపులైన్లు లీకేజీ లేకుండా చూడాలన్నారు. గ్రామాల్లో ప్రతికుటుంబానికి వంద రోజుల పనిని ఉపాధి హామీ పథకం కింద కల్పించడంపై గ్రామసభల్లో అవగాహన కల్పించాలన్నారు.

వణికిస్తున్న రోగం



అతిసార వ్యాధిగ్రస్థులకు వైద్య పరీక్షలు చేస్తున్న దృశ్యం

2 గ్రామాల్లో ప్రబలిన అతిసార

- ఎం.రాయాపురంలో మూడు రోజుల్లోనే 41 మందికి
- బాధిత గ్రామాల్లో వైద్య శిబిరాల ఏర్పాటు
- అయినా అదుపులోకి రాని మహమ్మారి

మడకశిర/రొళ్ల/అగళి ఆగస్టు 21: అతిసార వ్యాధితో రెండు గ్రామాల ప్రజలు అల్లాడిపోతున్నారు. రొళ్ల మండలం ఎం.రాయాపురం, గుడిబండ మండలం కొంకల్లు గ్రామాల్లో వ్యాధి తీవ్రతతో ప్రజలు మృత్యువాత పడు తున్నారు. ఇప్పటికే ఎం.రాయాపురం గ్రామంలో ముగ్గురు, కొంకల్లు గ్రామంలో ఏడుగురు చనిపోయారు. ఎం.రాయాపురం గ్రామంలో ఆరు రోజుల నుంచి పలువురు వాంతులు, విరేచనాలతో బాధపడుతూ ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. వైద్య సిబ్బంది రెండు గ్రామాల్లోనూ వైద్యశిబిరాలు ఏర్పాటు చేసి చికిత్స అందిస్తున్నారు. ఎం.రాయాపురంలో గత మూడు రోజుల్లోనే 41 మంది అతిసార బారినపడ్డారు. మూడు రోజుల క్రితం ఎం.రాయాపురం గ్రామానికి చెందిన ముగ్గురు వాంతులు విరేచనాలతో చికిత్స కోసం కర్ణాటక ప్రాంతాల్లోని ప్రైవేట్ ఆసుపత్రులకు వెళ్లారు. బెంగళూరులోని విక్టోరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రత్నాచారి (54)పార్వతమ్మ(54) సోమవారం మృతి చెందారు. శిర లోని ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న హనుమంతరాయప్ప(75) మంగళవారం సాయంత్రం చనిపోయాడని బంధువులు తెలిపారు.

నివారణకు చర్యలు

రెండు గ్రామాల్లో విజృంభిస్తున్న అతిసార వ్యాధికి అడ్డుకట్ట వేయడానికి అధికారులు చర్యలు ప్రారంభించారు. ఆయా గ్రామాల్లో లీకేజి ఉన్న తాగునీటి పైపులైన్లకు మరమ్మతులు చేపట్టారు. శుద్ధి చేసిన నీటినే ఇళ్లకు సరఫరా చేస్తున్నారు. పంచాయతీ రాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, సచివాలయ సిబ్బంది గ్రామంలో పర్యటించి పారిశుధ్య పనులు చేయిస్తున్నారు. గ్రామంలో మురుగు ఉన్న చోట బ్లీచింగ్ పౌడర్ చల్లించారు.



ఇంటింటికి వెళ్లి వివరాలను సేకరిస్తున్న వైద్యసిబ్బంది

సమష్టిగా పనిచేయండి

అతిసార వ్యాధి అదుపులోకి వచ్చేంతవరకు ప్రతి ఒక్కరూ సమష్టిగా పని చేయాలని పెనుకొండ ఆర్డీఓ వెంకటరామిరెడ్డి, డీఎంహెచ్ఓ మంజువాణి పేర్కొన్నారు. రొళ్ల మండలం ఎం.రాయపురం గ్రామంలో అతిసార వ్యాధితో బాధపడుతున్న వారిని బుధవారం వారు పరామర్శించారు. అతిసార వ్యాధి అదుపులోకి వచ్చే వరకు వైద్య సిబ్బంది , సంబంధిత అధికారులు అందుబాటులో ఉండి నివారించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. స్థానికంగానే వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ప్రతి రోగికి వైద్య చికిత్స అందించి కాపాడాలని వైద్యులకు సూచించారు.



ఎం. రాయపురం గ్రామాన్ని సందర్శించిన ఆర్డీఓ

చికిత్స అందిస్తున్నాం

అతిసార వ్యాధి వ్యాపించిన రెండు గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి బాధితులకు చికిత్స అందిస్తున్నాం. ఇంటింటికి వెళ్లి రోగుల వివరాలను సేకరించి వారందరికి వైద్యసేవలు అందిస్తున్నాం. వైద్యాధికారి, ఏఎన్ఎం, ఆశావర్కర్లు ప్రతి రోజు ఇంటింటికి వెళ్లి ప్రజల ఆరోగ్య పరిస్థితి తెలుసుకుంటున్నారు. వైద్య సేవల కోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశాం. ఈ బృందంలో వైద్యాధికారి, ఆశావర్కర్, ఏఎన్ఎం, ఎంఎల్‌హెచ్‌పీ సూపర్‌వైజర్ తదితర సిబ్బంది ఉంటారు. ఇతర పీహెచ్‌సీ నుంచి కూడా డాక్టర్లను డెప్యుటేషన్‌పై రప్పిస్తున్నాం. అతిసారా తగ్గు ముఖం పట్టేంత వరకు వైద్య శిబిరాలను నిర్వహిస్తాం. ప్రతి ఇంటి కి 20 లీటర్ల శుద్ధి నీటిని ఉదయం, సాయంత్రం అందిస్తున్నాం. ప్రతి రోజు వాటర్ శాంపిల్‌ను టెస్టింగ్ కు పంపిస్తున్నాం. ప్రతి ఒక్కరు నీటిని వేడి చేసి వడ పోసుకుని తాగాలి. ఇంట్లో అప్పుడే తయారు చేసిన ఆహార పదార్థాలను మాత్రమే భుజించాలి. ఎవరికైనా ఎలాంటి అనారోగ్య లక్షణాలు కనిపించినా వెంటనే వైద్య శిబిరానికి వచ్చి వైద్యం చేయించుకోవాలి.

- మంజువాణి, జిల్లావైద్య అధికారిణి

కంప్యూటరీకరణ పూర్తి చేయండి

పుట్టపర్తి, ఆగస్టు 21: జిల్లాలోని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల కంప్యూటరీకరణ సెప్టెంబరు 3లోగా వంద శాతం పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో ఆయన వ్యవసాయ సహకార పరపతి సంఘాల సీఈఓలు, అగ్రికల్చర్ అసి స్టెంట్లతో బుధవారం సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు, కేంద్ర ప్రభుత్వ కార్యక్రమాలకు సంబంధించి ప్యాక్స్ కంపూటరైజేషన్ పూర్తి చేయాలన్నారు. జిల్లాలో 1,93,633 రైతులుండగా ఇంతవరకు 21 శాతం మాత్రమే ఆన్‌లైన్లో పూర్తి చేశారని మిగిలిన వారిని సెప్టెంబరు 3లోగా పూర్తి చేయాలన్నారు. సమావేశంలో జిల్లా కో ఆపరేటివ్ అధికారి కృష్ణానాయక్, వ్యవసాయ అధికారి సుబ్బారావు, ఏడీసీసీ బ్యాంకు సీఈఓ సురేఖరాణి తదితరులు పాల్గొన్నారు.

కదిరి డీఎస్పీ బదిలీ



డీఎస్పీ శ్రీలత

కదిరి, ఆగస్టు 21: కదిరి డీఎస్పీగా పని చేస్తున్న శ్రీలతను బదిలీ చేస్తూ ఉన్నతాధికారులు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. దాదాపు రెండేళ్లుగా కదిరి డీఎస్పీగా పని చేస్తున్న ఆమెను తిరుపతి డీఎస్పీగా బదిలీ చేశారు.

ఉంటుందో.. ఊడుతుందో..?

ఫ్రీహోల్డ్ వెరిఫికేషన్‌తో రియల్టర్లలో గుబులు

- వేగంగా రికార్డుల పరిశీలన
- బయట పడనున్న అక్రమాలు

పెనుకొండ టౌన్, ఆగస్టు 21: అసైన్డ్ భూముల ఫ్రీహోల్డ్ వెరిఫికేషన్‌తో రియల్టర్లలో గుబులు రేగుతోంది. గత వైసీపీ పాలనలో సాగుదారులకు అసైన్డ్ భూములపై హక్కులు కల్పిస్తూ ఫ్రీహోల్డ్ జీఓ 596 తీసుకొచ్చారు. దీని ప్రకారం పట్టా పొంది 20 సంవత్సరాలు దాటిన సాగుదారులకు అసైన్డ్ భూములపై యాజమాన్య హక్కులు కల్పించారు. ఆమేరకు రెవెన్యూశాఖకు డిసెంబరు 2023లో ఉత్తర్వులు జారీచేశారు. అయితే టీడీపీ కూటమి అధికారంలోకి రాగానే ఫ్రీహోల్డ్ జీఓను కొందరు తప్పుదోవ పట్టించారని భారీగా ఆరోపణలు రావడంతో వెరిఫికేషన్ చేయాలని రెవెన్యూశాఖకు ఆదేశాలు జారీ చేశారు. ఇదే ఇప్పుడు రియల్టర్ల గుండెల్లో గుబులు రేకెత్తిస్తోంది. అక్రమాలు బయటపడితే 1బీలు రద్దు చేస్తారని కొన్న భూమితోపాటు డబ్బుకూడా పోతుందని ఆందోళన చెందుతున్నారు. 2003 జూలై 31లోపు అసైన్డ్ భూమి పట్టా పొంది సాగులో ఉండి అనంతరం వారి కుటుంబ సభ్యులే సాగుచేసుకుంటున్న వారికి 2023 ఆగస్టు1కి 20ఏళ్ల కాలపరిమితి విధించి ఫ్రీహోల్డ్ జీఓ 596ను అప్పటి వైసీపీ ప్రభుత్వం తీసుకొచ్చింది. ఇదే అదునుగా భావించిన కొందరు అక్రమాలకు తెరలేపారు. సాగులో లేని భూమిని, అలాగే తమ సర్వేనంబరుకు మరికొంత భూమి తీసుకుని లేఅవుట్లు వేశారు. ఇలాంటి వారందరూ ఎన్నికల సమయం దగ్గరపడుతుండటంతో అప్పట్లో నాయకుల అండతో అడ్డదారుల్లో మరికొన్ని భూములు ఫ్రీహోల్డ్‌లో వెళ్లేలా చూసుకున్నారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం శరవేగంగా వెరిఫికేషన్ చేయిస్తుండటంతో అధికారులు, రియల్టర్లలో ఆందోళన రేకెత్తుతోంది. మరో నెల రోజుల్లో అక్రమాల గుట్టు తేలనుంది.



ఆన్‌లైన్‌లో సర్వే చేస్తున్న వీఆర్ఓ

మూడు వేల ఎకరాల్లో రిజిస్ట్రేషన్

పెనుకొండ డివిజన్ పరిధిలో 12మండలాలకు గాను 1,01,748ఎకరాల భూమి ఫ్రీహోల్డ్‌లో చేరింది. గత ఏడాది డిసెంబరులో ఫ్రీహోల్డ్ జీఓ విడుదల కాగానే ఒక్క పెనుకొండ మండలంలోనే మూడువేల ఎకరాల భూమిని రైతుల నుంచి రియల్టర్లు రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. పెనుకొండ మండలంలో 7150మంది రైతులకు చెందిన భూమి 15,761ఎకరాలు ఫ్రీహోల్డ్‌లో ఉంచారు. అయితే కూటమి ప్రభుత్వం రిజిస్ట్రేషన్ల ప్రక్రియను నిలుపుదల చేసి, వెరిఫికేషన్ చేయిస్తుండటంతో భూమి క్రయవిక్రయాలు చేసినవారు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

బృందాలుగా వెరిఫికేషన్

ఫ్రీహోల్డ్ జీఓ 596 అక్రమాలపై రాష్ట్ర రెవెన్యూ కీలక ఆదేశాలు జారీచేసింది. వీఆర్ఓ, విలేజ్ సర్వేయర్, ఆర్ఐ వెరిఫికేషన్ అనంతరం నలుగురు డీటీల పర్యవేక్షణ తరువాత తహసీల్దార్, సబ్ కలెక్టర్, జేసీ, కలెక్టర్ పర్యవేక్షణతో వెరిఫికేషన్ ఉంటుంది. గతంలో వైసీపీ నాయకుల ఒత్తిడితో తప్పులు చేసి ఉంటే ఇప్పుడు సరిదిద్దుకోవాలని తిరిగి అదే తప్పు వెరిఫికేషన్‌లో చేసినట్లు బయటపడితే ఉద్యోగాలు ఊడుతాయన్న హెచ్చరికలతో అధికారులు పనులు వేగవంతం చేస్తున్నారు.

రెండింటిలో రైతుల వివరాలుండాలి

అసైన్డ్ భూములు పొందిన మొదటి రైతు, వారి తరువాత వారసుల జాబితా, సాగులో ఉన్నారా లేదా అనే వివరాలు సేకరించడంతోపాటు 20ఏళ్ల నుంచి రైతుకు ఇచ్చిన డీపట్టా, మెమోరాండం, ఆర్ఎస్ఆర్, 101, మ్యాన్యువల్ అడంగల్ ఈ ఐదు రికార్డులలో రెండు రికార్డులలో రైతుల వివరాలు ఉండాలి. అలా లేకపోతే ఆ పట్టా నకిలీగా నిర్ధారిస్తారు.

33.61ఎకరాల గుర్తింపు

పెనుకొండ డివిజన్ 12మండలాల్లో ఒక రోజు రీవెరిఫికేషన్‌లో 33.61 ఎకరాల భూమి రికార్డులో సరిలేదని గుర్తించారు. ఇక మూడు నెలల్లో పూర్తి సర్వేచేస్తే ఎన్ని ఎకరాలు బయటపడతాయోనని అధికారులు అన్నారు. ఇందులో పరిగి మండలంలో 24.43ఎకరాలు, లేపాక్షిలో 5.66ఎకరాలు, పెనుకొండ 1.11ఎకరాలు, హిందూపురం 2.8ఎకరాలు, బయటపడ్డాయి. పెనుకొండ మండలంలో అత్యధికంగా శెట్టిపల్లి, మునిమడుగులో అక్రమాలు జరిగినట్లు తెలుస్తుంది.

శరవేగంగా వెరిఫికేషన్ : తహసీల్దార్ శ్రీనివాస్



గత శనివారం నుంచి వెరిఫికేషన్ పనులు ప్రారంభించాం. ప్రతిరోజు సర్వే రిపోర్ట్‌ను సబ్‌కలెక్టర్ కార్యాలయానికి అందిస్తాం. పూర్తి సర్వే కాగానే ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకుంటుందో దాని ప్రకారం అమలు చేస్తాం. అనధికారిక ఫ్రీహోల్డ్‌లో ఉన్న సర్వేనంబర్లు, 1బీలను ఉన్నతాధికారుల ఆదేశాలతో తొలగిస్తాం.



కదిరి మున్సిపల్ కార్యాలయం

తాగేశారా..!

కదిరి మున్సిపాల్టీలో డీజిల్ గోల్‌మాల్



- మూడేళ్లలో రూ.50లక్షలకుపైగా స్వాహా?
- వాహనాలు తిరగడానికి, డీజిల్ వినియోగానికి కుదరని పొంతన

కదిరి, ఆగస్టు 21: మున్సిపాలిటీలో డీజిల్ వినియోగంలో గోల్‌మాల్ జరిగినట్లు సమాచారం. గడిచిన మూడేళ్లలో దాదాపు రూ.50లక్షలకు పైగా డీజిల్ బిల్లులు స్వాహా చేసినట్లు తెలిసింది. మున్సిపాలిటీలో వాహనాలు తిరిగినదానికి, డీజిల్ వినియోగానికి పొంతన కుదరడం లేదు. కొన్నివాహనాలు వాడినా, డీజిల్ వినియోగించలేదని అధికారులు చెబుతున్నారు. ఈ అవినీతిపై గత మున్సిపల్ సమావేశంలో కౌన్సిలర్లు లేవనెత్తగా, ఇంతవరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. మున్సిపాల్టీలో ఫాగింగ్‌కు రూ.లక్షలు ఖర్చు చేసినట్లు రికార్డుల్లో చూపుతున్నారు. అయితే ఎక్కడ ఫాగింగ్ చేశారో పుర ప్రజలకే తెలియాలి. రూ.కోట్లలో డీజిల్ బిల్లులు పెట్టినా సరే క్లాప్ పేరుతో ఓ ప్రైవేటు సంస్థకు రూ.లక్షలు చెల్లించారు. దీనిపైకూడా సమగ్ర విచారణ జరిగితే అవినీతి ఎక్కడ జరిగిందో? ఎవరు చేశారో తేటతెల్లమవుతుంది.

2021 ఏప్రిల్ నుంచి 2022 జూలై వరకు మున్సిపల్ అధికారులు ఇచ్చిన డీజిల్ బిల్లులు చూసే ఎంతమేర గోల్‌మాల్ చేసి ప్రజాధనాన్ని స్వాహా చేశారో అర్థం అవుతుంది. మున్సిపాలిటీలోని మినీ ఎక్స్‌కవేటర్ 26 నెలలు పని చేసినందుకు రూ.20లక్షల డీజిల్ బిల్లు చెల్లించారు. నెలకు దాదాపు రూ.77వేలు డీజిల్ కోసం ఖర్చు చేసినట్లు అధికార లెక్కలు చెబుతున్నాయి. వాస్తవానికి ఈ 26 నెలల్లో మినీ ఎక్స్‌కవేటర్ రోజుకు పదిగంటలు పని చేసినా, ఇంత డీజిల్ వినియోగం కాదు. మరి మున్సిపాలిటీలో 26 నెలలు మినీ ఎక్స్‌కవేటర్‌తో ఎన్నిగంటలు ఎక్కడెక్కడ పనిచేయించారో అధికారులకే తెలియాలి. సాధారణంగా ఎక్స్‌కవేటర్‌ను రోజుకు నాలుగైదు గంటలకంటే ఎక్కువగా వాడిన దాఖలాలు ఎప్పుడు లేవని కౌన్సిలర్లు అంటున్నారు. మరి డీజిల్ బిల్లులకు, వాహన వినియోగానికి పొంతన కుదరడం లేదు. ఎక్స్‌కవేటర్‌ను 15నెలలు వాడి, రూ.14.3 లక్షలు డీజిల్ బిల్లులు చెల్లించారు. నెలకు సరాసరి రూ.95వేలు చెల్లించారు. అలాగే మరో ఎక్స్‌కవేటర్‌ను 14 నెలలు వాడి రూ.పది లక్షల అద్దె చెల్లించారు. నెలకు సరాసరి రూ. 71వేలు చెల్లించినట్లు లెక్కలు చెబుతున్నాయి.

మూడేళ్లలో రూ. లక్షలు స్వాహా

బొలెరో వాడినా కానరాని డీజిల్ లెక్కలు

మున్సిపాలిటీలో ఓ బొలెరో వాహనం ఉంది. దీన్ని కదిరి నుంచి చిత్రావతి వరకు అత్యవసర పనులకోసం వినియోగిస్తారు. నెలకు నాలుగైదు మార్లు కూడా వినియోగించలేదని కౌన్సిలర్లు చెబుతున్నారు. కానీ బొలెరోకు నెలకు రూ.49వేల వంతున 16 నెలల డీజిల్ బిల్లులు చెల్లించారు. డిసెంబరు 2023తరువాత ఈవాహనానికి సంబంధించిన డీజిల్ ఖర్చును అధికారులు చూపించలేదు. అలాగని వాహనం వినియోగించలేదా అంటే వినియోగించి నట్లు కౌన్సిల్ మీట్‌లో డీఈఈ విజయ్‌కుమార్ సమాధానమించారు. డీజిల్ లేకుండా ఏవిధంగా వినియోగించారన్న ప్రశ్నకు అధికారుల నుంచి సమాధానమే లేదు. ఈ ఉదాహరణ చాలు మున్సిపాలిటీలో డీజిల్ గోల్‌మాల్ జరిగిందడానికి అని పలువురు అభిప్రాయపడుతున్నారు.

ఫాగింగ్‌కు రూ.పది లక్షలట !

మున్సిపాలిటీలో 16నెలలకు ఫాగింగ్ చేసినందుకు పెట్రోల్‌కు దాదాపు రూ.పది లక్షల బిల్లులు పెట్టారు. 2023 మేలో రూ.1.78లక్షలు, అదే ఏడాది ఏప్రిల్‌లో రూ.1.38 లక్షల బిల్లు పెట్టారు. మండు వేసవిలో ఫాగింగ్ ఎప్పుడు చేశారో తమకు తెలియదని పుర ప్రజలంటున్నారు. మున్సిపాల్టీలో ఉన్న మూడు ఫాగింగ్ యంత్రాలు రోజూ వినియోగించినా రెండు లీటర్ల కంటే ఎక్కువ పెట్రోలు ఖర్చు కాదు. అలాంటిది నెలకు రూ.లక్షల్లో పెట్రోల్ బిల్లులు పెట్టినా ఆడిట్ అధికారులు కళ్లు మూసుకుని సంతకాలు చేసినట్లు సమాచారం. ఫాగింగ్ చేయకనే ఉత్తిత్తు బిల్లులు పెట్టనట్లు ప్రజలు మండిపడుతున్నారు.

కానరాని 2023-24 డీజిల్ బిల్లుల రికార్డులు

జూలై 2023 నుంచి జూలై 2024 వరకు వాహనాల డీజిల్ వినియోగానికి బిల్లుల రికార్డులు ఎక్కడున్నాయో మున్సిపాలిటీలో ఎవరికి తెలియదు. ఇదే అంశాన్ని గతంలో ఆంధ్రజ్యోతి దినపత్రిలో రికార్డులు ఎక్కడ అన్న శీర్షికన కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. కౌన్సిల్ సభ్యులుకూడా గత కౌన్సిల్ మీటల్‌లో ప్రశ్నించారు. అయినా ఇంతవరకు బిల్లులు ఎక్కడున్నాయో తెలియని పరిస్థితి. బిల్లుల రికార్డులు మాత్రం ఛైర్‌పర్సన్ ఇంటిలో ఉన్నాయని మున్సిపల్ డీఈ విజయ్‌కుమార్ చెప్పారని గత కౌన్సిల్‌మీట్‌లో కౌన్సిల్ సభ్యులు పేర్కొన్నారు. అయినా ఇంతవరకు బిల్లుల వివరాలు పత్తాలేకుండా ఉన్నాయి.

స్వాహా వెనక ప్రజాప్రతినిధులు?



మున్సిపాలిటీలో డీజిల్ బిల్లులు స్వాహా వెనుక కొంతమంది ప్రజా ప్రతినిధులున్నట్లు సమాచారం. రూ.లక్షల్లో డబ్బులు తీసుకోవడంతో పాటు, తమ వాహనాలకు కూడా డీజిల్ వేయించుకున్నట్లు సమాచారం. డీజిల్ రికార్డులను పర్యవేక్షించడానికి శాశ్వత ఉద్యోగులు కాకుండా వారికిష్టమొచ్చిన అవుట్‌సోర్సింగ్ ఉద్యోగిని నియమించారు. ఆయన ద్వారానే డీజిల్ బిల్లుల స్వాహాకు పాల్పడినట్లు సమాచారం. పూర్తిస్థాయిలో విచారణ జరిగితే డీజిల్ బిల్లుల గోల్‌మాల్ వెల్లడయ్యే అవకాశం ఉంది.

విచారణ చేస్తున్నాం

మున్సిపాలిటీలో డీజిల్ బిల్లుల చెల్లింపులో అవకతవలు జరిగినట్లు నాదృష్టికి వచ్చింది. వీటిపై సమగ్ర విచారణ జరుపుతున్నాం, 2023 జూలైనుంచి 2024 జూలై వరకు సంబంధించిన డీజిల్ బిల్లులు త్వరలోనే సభ్యులకు పంపుతాం.

-కిరణ్‌కుమార్, మున్సిపల్ కమిషనర్, కదిరి

అలరించిన భక్తిగీతాలు



పాటలు పాడుతున్న భక్తులు

ఒడిశా సత్య సాయి భక్తులు తమ భక్తిగీతాలతో వీక్షకులను మైమరపింపజేశారు. రెండో రోజు బుధవారం సాయికుల్వంత్ సభా మండపంలో హృదయ వీణ పేరిట భక్తి గీతాల ఆలాపన చేపట్టారు. గంట పాటు సత్యసాయి ప్రేమతత్వంపై ఆలపించిన భక్తిగీతాలు భక్తులను అలరించాయి. అనంతరం భక్తులు సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు.

- పుట్టపర్తి

ఎంత పెద్ద చేపనో..!



యాడికి, ఆగస్టు 21: బుధవారం యాడికిలో 25కిలోల బరువున్న చేప ఒకటి విక్రయానికి వచ్చింది. దానిని చూసిన స్థానికులు అమ్మో! ఇంత పెద్ద చేప అంటూ నోరెళ్లబెట్టారు. చేపను విక్రయానికి తీసుకువచ్చిన వ్యక్తితో వివరాలు ఆరాతీయగా మండల సరిహద్దులో ఉన్న పెండేకల్లు డ్యాం నుంచి తీసుకువచ్చినట్లు తెలిపాడు. అంతపెద్ద చేపను కొనడానికి ఎవరూ ముందుకు రాకపోవడంతో చికెన్ దుకాణ యజమానికి రూ.2వేలకు విక్రయించి వెళ్లిపోయాడు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

న్యాయ సేవ అధికార సంస్థ జిల్లా కార్యదర్శి శివప్రసాద్ యాదవ్



మాట్లాడుతున్న శివప్రసాద్ యాదవ్

అనంతపురం కల్చరల్/క్రైం, ఆగస్టు 21: చట్టాలపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగివుండాలని న్యాయ సేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి శివప్రసాద్ యాదవ్ అన్నారు. సమాజంలో సెక్స్ వర్కర్లకు సమాన హక్కులు, ప్రాథమిక హక్కులు ఉన్నాయన్నారు. వారికీ చట్టాలు వర్తిస్తాయని వివరించారు. బుధవారం రాజహంస డీలక్స్ కన్వెన్షన్ హాల్‌లో సంగ్రామ్ సంస్థ, నేషనల్ నెట్‌వర్క్ ఆఫ్ సెక్స్ వర్కర్స్, సింధూర ఆర్గనైజేషన్, ఝాన్సీ లక్ష్మీ కమ్యూనిటీ ఆర్గనైజేషన్ల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పోలీసులు సెక్స్ వర్కర్లకు సముచిత గౌరవం ఇవ్వాలని సూచించారు. సెక్స్ వర్కర్లందరూ స్వయం ఉపాధి పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. న్యాయవాది పద్మజ మాట్లాడుతూ జీవనోపాధికోసం మాత్రమే కొందరు స్వచ్ఛందంగా ఈ వృత్తిని ఎంచుకున్నారని, అలాంటివారిని బలవంతంగా ప్రేరేపించడానికి వీలులేదని, వారికి రక్షణ కల్పించాల్సిన బాధ్యత వ్యవస్థలపై ఉందన్నారు. కార్యక్రమంలో వెంకటరమణ, రెడ్స్ పీడీ చిట్టప్ప, సెరా పీడీ కుళ్లాయప్ప, శాంతి, పోతులయ్య, హరికృష్ణ, పద్మజ, నాగమణి, ఝాన్సీ, పుష్పావతి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో కూలీ మృతి



మృతి చెందిన నరసింహులు

గుత్తి రూరల్, ఆగస్టు 21: మండలంలోని కొత్తపేట గ్రామశివారులోని 44వ జాతీయ రహదారిపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నరసింహులు(37) కూలీ మృతి చెందాడు. నంద్యాల జిల్లా ప్యాపిలికి చెందిన నరసింహులు అనంతపురం టమోటా మార్కెట్‌లో కూలీగా పని చేస్తున్నాడు. బుధవారం తెల్లవారుజామున నలుగురితో కలసి ఆటోలో అనంతపురానికి వెళ్తుండగా కొత్తపేట గ్రామశివారులోకి రాగానే ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో నరసింహులుకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు గుర్తించి గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే నరసింహులు మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృత్యుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

నూతన జేసీ బాధ్యతల స్వీకరణ



కలెక్టర్‌ను కలిసిన నూతన జేసీ

అనంతపురం టౌన్, ఆగస్టు 21: జిల్లా నూతన జాయింట్ కలెక్టర్‌గా శివనారాయణశర్మ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. కలెక్టరు వినోద్‌కుమార్‌ను కలిసి బాధ్యతలు తీసుకున్నారు. నూతన జేసీకి డీఆర్‌ఓ రామక్రిష్ణారెడ్డి, కలెక్టరేట్ ఏఓ మారుతి, పలువురు తహసీల్దార్లు, కలెక్టరేట్ అధికారులు అభినందనలు తెలిపారు.

అర్హులకు రుణాలు మంజూరు చేయాలి

పుట్టపర్తి, ఆగస్టు 21: అర్హులకు రుణాలు మంజూరు చేయాలని కలెక్టర్ టీఎస్ చేతన్ సూచించారు. కేటాయించిన లక్ష్యాలను బ్యాంకర్లు సకాలంలో పూర్తిచేయాలని ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో 2024-25 త్రైమాసిక ఆర్థిక సంవత్సరానికి సంబంధించి లక్ష్యసాధన, ప్రగతిపై బ్యాంకర్లు, ప్రభుత్వశాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కౌలు రైతులు, విద్యార్థులు, మత్స్యకారులు, చేనేతలు, పండ్లతోటల పెంపకం, పశుపోషణ, స్వయంసహాయక సంఘాలు, నిరుద్యోగ యువత ఉపాధి కల్పనకు సంబంధించి చేసుకున్న దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి రుణాలు అందించి ఆర్థిక ఎదుగుదలకు ప్రోత్సాహం అందించాలన్నారు. కార్యక్రమంలో పట్టుపరిశ్రమలశాఖ జేడీ పద్మమ్మ, వ్యవసాయి అధికారి వైపీ సుబ్బారావు, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, పశుసంవర్థకశాఖ అధికారి శుభదాసు, ఉద్యానవనశాఖ అధికారి చంద్రశేఖర్, చేనేతజౌళిశాఖ అధికారి రమేష్, పరిశ్రమల శాఖ జనరల్‌మేనేజర్ చాంద్‌బాషా, ఆర్‌బీఐ ఎల్డీఓ గిరిధర్ పాల్గొన్నారు.

ఇండస్ట్రియల్ కోటా కింద ప్రవేశాలు

అనంతపురం సెంట్రల్, ఆగస్టు 21: జేఎన్‌టీయూలో ఇండస్ట్రియల్ కోటా కింద పీహెచ్‌డీ ప్రవేశాలను కల్పిస్తున్నట్లు బుధవారం డైరెక్టర్ అడ్మిషన్స్ ప్రొఫెసర్ కిరణ్మయి తెలిపారు. ఇప్పటికే ఆర్‌సెట్ ద్వారా అడ్మిషన్స్ జరిగాయని. వీసీ ప్రొఫెసర్ సుదర్శన రావు ఆదేశాల మేరకు ఇండస్ట్రియల్ కోటా భర్తీచేస్తున్నట్లు పేర్కొన్నారు. పరిశ్రమలలో పనిచేస్తున్నవారు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంస్థల ఎగ్జిక్యూటివ్స్, ఆర్‌అండ్‌డీ సైంటిస్టులు, ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు ఈ కోటాలో ప్రవేశాలు కల్పిస్తున్నామన్నారు. మాస్టర్ డిగ్రీలో కనీసం 55శాతం మార్కులు, 6.0సీజీపీఏ సాధించిన వారు అర్హులని తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు సెప్టెంబరు 4లోపు రూ.5వేల డీడీతో దరఖాస్తుకు సంబంధించిన సర్టిఫికెట్స్‌ను జతపరిచి అడ్మిషన్స్ కార్యాలయంలో సమర్పించాలని కోరారు. వివరాలకు www.jntua.ac.in వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

వేధింపుల కేసులో జైలు శిక్ష

గార్లదిన్నె, ఆగస్టు 21: వరకట్నం కేసులో ఓ మహిళ ఫిర్యాదు మేరకు ఆమె భర్త, అత్తమామలకు ఏడాది జైలు శిక్ష పడింది. గార్లదిన్నె మండలం మర్తాడు గ్రామానికి చెందిన షరీఫ్‌కు తాడిపత్రి మండలం యర్రగుంటకు చెందిన హసీనాతో వివాహం జరిగింది. వీరికి పాప పుట్టింది. అప్పటి నుంచి హసీనాను భర్తతోపాటు అత్తమామలు అదనపు కట్నం కోసం వేధింపులకు గురిచేయడం ప్రారంభించారు. దీంతో హసీనా 2020లో భర్త, అత్తమామలపై పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు దర్యాప్తు చేపట్టారు. కాగా బుధవారం అనంతపురం మొబైల్ కోర్టులో విచారణ జరిగింది. ముద్దాయిలకు ఏడాది జైలు శిక్ష, రూ.10వేలు జరిమానా విధించారు. అదేవిధంగా హసీనాకు నష్టపరిహారం కింద రూ.1.50లక్షలు ఇవ్వాలని న్యాయాధికారి సుజిన్‌కుమార్ తీర్పు ఇచ్చారు.

పోలీసుల అదుపులో హత్యకేసు నిందితులు

హిందూపురం, ఆగస్టు 21: మేకల కాపరి జయమ్మను హత్యచేసిన నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం. సోమవారం మలుగూరుకు చెందిన జయమ్మ గ్రామ సమీపంలో మేకలు మేపుతుండగా ఆమెను హత్యచేసి 13 మేకలను ఎత్తుకెళ్లారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. ఇన్‌చార్జ్ డీఎస్పీ శ్రీనివాసులు, సీఐ ఆంజనేయులు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసుకుని మేకలు తరలించేందుకు ఉపయోగించిన బొలెరో వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ వాహనం పరిగి మండలం గొల్లపల్లికి చెందినదికాగా మేకలను ఎత్తుకెళ్లిన యువకుడిది సోమందేపల్లి మండలం ఈదులబళాపురంగా నిర్ధారణకు వచ్చారు. అనుమానితులను విచారిస్తున్నట్లు తెలుస్తోంది. ఈదులబళాపురానికి చెందిన యువకుడు మాత్రమే హత్యలో పాల్గొన్నట్లు పోలీసులు ప్రాథమిక నిర్ధారణకు వచ్చినట్లు తెలిసింది. అయితే నిందితుడు గతంలో ఇతర నేరాలకు కూడా పాల్పడినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. కొద్ది నెలల క్రితం హిందూపురం మండలంలో పలు గ్రామాల్లో పశువులను ఎత్తుకెళ్లారు. వాటిలో కూడా ఈ నిందితుడి పాత్ర ఉన్నట్లు సమాచారం.

ప్రైవేటు 'సంక్షేమమే' లక్ష్యమా..?

- ప్రభుత్వ భవనాలున్నా అద్దె భవనాల్లోనే హాస్టళ్లు
- మండల కేంద్రాల్లోనూ ఇదే దుస్థితి

ఏటా రూ.1.80 కోట్లకుపైగా ప్రభుత్వ సొమ్ము దుర్వినియోగం



ఎమ్మార్సీ కార్యాలయంలో శింగనమల జడ్పీ బాలికల వసతి గృహం

అనంతపురం ప్రెస్‌క్లబ్, ఆగస్టు 21: పేద విద్యార్థులకు విద్య, వసతి, నాణ్యమైన భోజనం అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఏర్పాటు చేసిన సంక్షేమ వసతి గృహాల వ్యవస్థ అధికారుల నిర్లక్ష్యం కారణంగా నీరుగారిపోతోంది. ప్రభుత్వ వసతి గృహాలున్నా వాటిలో కాకుండా అద్దె భవనాల్లో అది కూడా ఇరుకు గదులు అరకొర వసతులున్న భవనాల్లో నిర్వహిస్తున్నారు. వీరి నిర్వాకంతో ఓ వైపు విద్యార్థులు ఇబ్బందులు పడుతుండగా మరోవైపు ప్రభుత్వ సొమ్ము వృథా అవుతోంది.

ప్రభుత్వ భవనాలున్నా..

సంక్షేమశాఖల అధికారులకు జిల్లా కేంద్రంలో అది కూడా నగర నడిబొడ్డున ఉన్న ప్రభుత్వ భవనాలు కనిపించకపోవడం గమనార్హం. అవేమైనా వాడకానికి వీలులేని పరిస్థితుల్లో ఉన్నాయా అంటే ఒక్కో భవనంలో రెండు హాస్టళ్లు నిర్వహించే సామర్థ్యం ఉన్నవే. నగరంలో పలు ప్రభుత్వ భవనాలు ఖాళీగా ఉన్నాయి. అయినా అధికారులు అద్దె భవనాల వైపే మక్కువ చూపుతున్నారు. ఫలితంగా నెలనెలా ఎస్సీ, బీసీ సంక్షేమ వసతిగృహాలకు సంబంధించి ప్రైవేట్ భవనాల యజమానులకు రూ. 15 లక్షలకుపైగా అద్దె చెల్లించాల్సి దుస్థితి నెలకొంది.

- నగరంలోని అటవీశాఖ కార్యాలయం పక్కనే ఓ ప్రభుత్వ భవనం ఉంది. ఆ భవనంలో ఇదివరకూ విజిలెన్స్ కార్యాలయాన్ని నిర్వహించారు. సంవత్సర కాలంగా ఆ భవనం ఖాళీగా ఉంది. ఆ భవనాన్ని వినియోగిస్తే దాదాపు 400 మందికిపైగా విద్యార్థులకు వసతి కల్పించవచ్చు. అంటే రెండు హాస్టళ్లు అక్కడ నిర్వహించే వెసులుబాటు ఉంది.
- కలెక్టరేట్ సమీపంలో ఎస్సీ సంక్షేమశాఖ కార్యాలయం వెనుకవైపు ఎస్కేయూ, ఎస్సీ వెల్ఫేర్ అనుసంధానంగా ఏర్పడిన స్కియాడ్ భవనం ఉంది. ఆ భవనం దాదాపు నాలుగేళ్లుగా ఖాళీగా ఉంది. ఇప్పటికీ నూతన గదులతో ఆ భవనం చెక్కుచెదరలేదు. అందులోనూ దాదాపు రెండు హాస్టళ్లను నిర్వహించవచ్చు.
- నగరంలోని ఎస్సీ వెల్ఫేర్ వెనుకవైపు ఓ హాస్టల్ భవనం ఉంది. ఆ హాస్టల్ కెపాసిటీ దాదాపు 500 మందికిపైగా ఉంది. అయితే సకాలంలో ఆ భవనానికి మరమ్మతులు చేయించడంలో అధికారులు నిర్లక్ష్యం చూపడంతో ఆ భవనం శిథిలమైంది. ఇప్పటికీ ఆ భవనానికి మరమ్మతులు చేయిస్తే ఉపయోగంలో వచ్చే అవకాశం ఉంది.
- నగరంలోని దివ్యశ్రీ ఆస్పత్రి ఎదురుగా ఎస్సీ హాస్టల్ ఉంది. ఆ హాస్టల్ దాదాపు నాలుగేళ్లకుపైగా మూతపడింది. దానికి మరమ్మతులు చేపడితే రెండు హాస్టళ్లను నిర్వహించే అవకాశం ఉంది.
- శింగనమల మండల కేంద్రంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బాలికల వసతిగృహం కోసం ఓ భవనాన్ని నిర్మించారు. అయితే ఊరికి దూరంగా ఉందని ఆ భవనాన్ని వినియోగించుకోకపోవడంతో అందులో ప్రస్తుతం ఎమ్మార్సీ కార్యాలయాన్ని నిర్వహిస్తున్నారు. అలాగే శింగనమలలో ఎస్సీ బాలికల వసతి గృహం భవనాన్నీ వాడుకోకుండా గాలికొదిలేయడంతో ఆ భవనమూ ప్రస్తుతం ఖాళీగా ఉంటోంది. ఫలితంగా శింగనమల బీసీ, ఎస్సీ బాలికల వసతి గృహాలను జిల్లా కేంద్రంలోని ప్రైవేట్ భవనాల్లో నిర్వహిస్తున్నారు.

ప్రత్యామ్నాయం పట్టదా..?

మండల కేంద్రాల్లో నిర్మించిన ప్రభుత్వ వసతి గృహాలను వినియోగించుకోవడంలో సంక్షేమశాఖల అధికారులు నిర్లక్ష్యం చూపుతున్నారు. కేవలం కళాశాలలకు దూరంగా ఉన్నాయన్న ఒకే ఒక్క కారణంతో ఆ భవనాలు వదిలి జిల్లా కేంద్రంలోని ప్రైవేట్ భవనాల్లోకి వసతి గృహాలకు మార్చేశారు. నిబంధనల మేరకు వసతిగృహాలకు ఏవైనా సమస్యలున్నా కళాశాలలకు దూరంగా ఉన్నా అందుకు ప్రత్యామ్నాయ మార్గాలు ఏర్పాటు చేయాల్సిన బాధ్యత ఆయా సంక్షేమ శాఖల అధికారులపై ఉంది. అయితే అటువైపు అధికారులు ఆలోచించకపోవడంతో ప్రభుత్వానికి తీరని నష్టం వాటిల్లుతోంది. దూరంగా ఉన్న హాస్టళ్లకు రవాణా సదుపాయం కల్పించాల్సిన అవసరం ఉంది. ఆర్టీసీ అధికారులతో మాట్లాడి కళాశాలలో విద్యార్థుల సంఖ్యను బట్టి బస్సు సౌకర్యం ఏర్పాటు చేయాల్సి ఉంది. అయితే కనీసం ఆయా సంక్షేమశాఖల అధికారులు ఆర్టీసీ వారితో చర్చలు జరిపిన దాఖలాలు లేవు. దూరంగా ఉందంటే ప్రైవేట్ భవనంలో మార్చాలనే ఒకే ఒక్క కాన్సెప్ట్‌ను సంక్షేమశాఖల అధికారులు ఎంచుకొంటున్నారు.



నిరుపయోగంగా ఉన్న శింగనమలలోని ఎస్సీ బాలికల వసతి గృహం

కాలేజీ హాస్టళ్ల సమస్య ఉంది

జిల్లాలోని పలు వసతి గృహాలు ప్రైవేట్ భవనాల్లో నిర్వహిస్తున్న మాట వాస్తవమే. అయితే ప్రభుత్వ భవనాలు లేని చోట మాత్రమే ప్రైవేట్ భవనాల్లో హాస్టళ్లు నిర్వహిస్తున్నాం. ఉన్న వసతిగృహాల్లో ఏవైనా సమస్యలుంటే వాటికి సంబంధించి రిపేరీలు చేయించి వినియోగించుకుంటున్నాం. ప్రీమెట్రిక్ హాస్టళ్లన్నీ దాదాపుగా సొంత భవనాల్లోనే నిర్వహిస్తున్నాం. కాలేజీ హాస్టళ్లకు మాత్రమే సమస్య ఉంది. మండల కేంద్రాల్లో హాస్టళ్లు ఉన్నప్పటికీ కాలేజీలకు దూరంగా ఉన్నాయి. ఫలితంగా విద్యార్థుల ఇబ్బందుల దృష్ట్యా జిల్లా కేంద్రంలోని పలు ప్రైవేట్ భవనాల్లో వసతి గృహాలు నిర్వహిస్తున్నాం.

- కుష్బూకొఠారీ, డీడీ, బీసీ, ఎస్సీ సంక్షేమశాఖలు



ఎస్సీ సంక్షేమశాఖ కార్యాలయం వెనుకవైపు ఉన్న స్కియాడ్ భవనం



దెబ్బతిన్న టమోటా పంటను చూపుతున్న రైతు చంద్రశేఖర్



మిర్చిపంటను చూపుతున్న రైతు పెద్దకేశవయ్య

వర్షానికి దెబ్బతిన్న పంటలు

నీట మునిగిన టమోటా, మిరప పంటలు
ఆవేదనలో రైతులు

ధర్మవరంరూరల్, ఆగస్టు 21: వర్షాలకు సాగుచేసిన పంటలు దెబ్బతినడంతో రైతులు లబోదిబోమంటున్నారు. ఏలుకుంట్ల గ్రామంలో రైతు పెద్దకేశవయ్య ఎకరాలో సాగుచేసిన మిరప, రైతు చంద్రశేఖర్ ఎకరాలో సాగుచేసిన టమోటా పంటలు నీటమునిగాయి. అంతేకాకుండా పలువురు రైతులు సాగుచేసిన వేరుశనగ, మొక్కజొన్న దెబ్బతిన్నాయి. మిరప, టమోటా కోతకు వచ్చిన దశలో వర్షం రావడంతో పూర్తిగా నష్టపోయినట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. హార్టికల్చర్ అధికారి గీతాంజలి పంటలను పరిశీలించారు. పంటనష్టంపై ఉన్నతాధికారులకు నివేదికలు అందిస్తామని తెలిపారు.

కళ్యాణదుర్గంలో బీడీ మంటలు

- కిందపడి పగిలిపోయిన పెట్రోల్ క్యాన్
- బీడీ అంటించుకుని.. అగ్గిపుల్ల పడేసిన పొగరాయుడు
- భారీగా చెలరేగిన మంటలు.. అదుపు చేసిన స్థానికులు



సీసీ ఫుటేజీలో రికార్డయిన బీడీ తాగుతున్న వ్యక్తి



వ్యాపించిన మంటలు

కళ్యాణదుర్గం రూరల్, ఆగస్టు 21: కళ్యాణదుర్గం మండల కేంద్రంలో పెట్రోల్ క్యాన్ కింద పడి పగిలిపోవడం, బీడీ తాగుతున్న వ్యక్తి అగ్గిపుల్ల పడేయటంతో భారీగా మంటలు చెలరేగాయి. స్థానికులు నీరు చల్లి మంటలను ఆర్పేయడంతో పెను ప్రమాదం తప్పింది. పట్టణంలోని పాత బస్టాండు సమీపంలో జేఏఎస్ శెట్టి అండ్ సన్స్ పెట్రోల్ బంకు ఉంది. ఓ వ్యక్తి బుధవారం ఉదయం 20 లీటర్ల క్యాన్‌లో పెట్రోల్ పట్టించుకున్నాడు. క్యాన్‌ను తన ద్విచక్ర వాహనంపై పెట్టుకుని సమీపంలో ఉన్న ఓ మెడికల్ షాపు వద్దకు వెళ్లాడు. బైక్ ఆపి మెడికల్ షాప్‌లోకి అతను వెళ్లిన కాసేపటి పెట్రోల్ క్యాన్ కింద పడి పగిలిపోయింది. పెట్రోల్ మొత్తం రోడ్డు వెంబడి పారింది. అదే సమయంలో అక్కడికి సమీపంలో ఓ వ్యక్తి బీడీ అంటించుకుని అగ్గిపుల్లను రోడ్డుపై వేశాడు. పెట్రోలు అగ్గిపుల్లను తాకగానే భారీగా మంటలు చెలరేగాయి. చుట్టుపక్కల ఉన్నవారు భయంతో పరుగులు తీశారు. రోడ్డు పక్కన ఉన్న ఓ ద్విచక్ర వాహనం పాక్షికంగా దగ్ధమైంది. మంటలు చెలరేగిన ప్రాంతానికి కేవలం పది అడుగుల దూరంలో పెట్రోల్ బంక్ ఉండటంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. దుకాణదారులు సంపులో ఉన్న నీటితో మంటలను ఆర్పివేయడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. పోలీసులు చేరుకుని సీసీ ఫుటేజీని పరిశీలిస్తేగానీ బీడీ కాల్చిన వ్యక్తి కారణంగా మంటలు చెలరేగినట్లు బయటపడలేదు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య



రవి (ఫైల్)

కళ్యాణదుర్గం, ఆగస్టు 21: అనంతపురం జిల్లా శెట్టూరు మండలం లింగదీర్లపల్లి గ్రామానికి చెందిన రైతు రవి(48) బుధవారం ఆత్మహత్య చేసుకున్నాడు. రవికి నాలుగున్నర ఎకరాల పొలం ఉంది. బోరు బావుల తవ్వకానికి, వ్యవసాయ పెట్టుబడులకు రూ.6 లక్షలు అప్పు చేశాడు. వేరుశనగ పంట సాగు చేసి తీవ్రంగా నష్టపోయాడు. అప్పులు తీర్చలేక ఒత్తిడికి లోనయ్యాడు. ఇంట్లో సిమెంట్ దూలానికి బుధవారం తెల్లవారుజామున లుంగీ తో ఉరివేసుకున్నాడు. రైతు భార్య రేణుకమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సినీ ఫక్కీలో కిడ్నాప్

- ప్రతిఘటించి తప్పించుకున్న చిరు వ్యాపారి



బాధితుడిని విచారిస్తున్న సీఐ వెంకటేశ్వర్లు

బుక్కరాయసముద్రం, ఆగస్టు21: సినీ ఫక్కీలో జరిగిన ఓ చిరు వ్యాపారి కిడ్నాప్ జిల్లాలో కలకలం రేపింది. అయితే ఆ వ్యాపారి కిడ్నాపర్లను ప్రతిఘటించి మండల పరిధిలోని జంతులూరు గ్రామం వద్ద బయటపడ్డాడు. పోలీసులు, బాధితుడు తెలిపిన మేరకు... అనంతపురం నగరంలోని తపోవనం ప్రాంతానికి చెందిన కుళ్లాయప్ప చీరలు, మిక్సీలు, వంట సామగ్రి వస్తువులను ప్రతి రోజు ద్విచక్రవాహనంలో తీసుకెళ్లి బుక్కరాయసముద్రం, నార్పల, శింగనమల మండలాల్లోని గ్రామాల్లో విక్రయించి పొట్టపోసుకునేవాడు. వ్యాపారం నిమిత్తం బుధవారం నార్పలకు వెళ్తుండగా... బుక్కరాయసముద్రం గాంధీనగర్ వద్ద కారులో నలుగురు వచ్చి కుళ్లాయప్పను కిడ్నాప్ చేశారు. కారులోనే మూడు గంటల పాటు నార్పల, బుక్కరాయసముద్రం పరిధిలోని పలు గ్రామాల్లో తిప్పారు. ముసుగువేసి కారులోనే చితకబాదారు. ఐదు నెలలుగా తిరుగుతున్నాం... ఇప్పుడు దొరికావ్ అంటూ చితకబాదారని కుళ్లాయప్ప వాపోయాడు.

ప్రతిఘటించడంతో... తప్పిన ప్రమాదం

పథకం ప్రకారం చిరు వ్యాపారి కుళ్లాయప్పను కిడ్నాప్ చేసి కారులోనే చితకబాదారు. చివరికి ఇంకా హత్య చేస్తారని భావించిన కుళ్లాయప్ప .. కారు డ్రైవర్ గొంతు గట్టిగా చేతులతో పట్టుకున్నాడు. దీంతో కారు డ్రైవింగ్ చేస్తున్న వ్యక్తి కారు అదుపు చేయలేక జంతులూరు గ్రామం వద్ద రోడ్డు పక్కనే ఉన్న చెట్టుకు ఢీ కొని చిన్న గోతిలో దించాడు. దీంతో కారు బయటకు రాకపోవడంతో కిడ్నాపర్లు జంతులూరు గ్రామం వద్ద నుంచి పరారీ అయ్యారు. అనంతరం 100కు ఫోన్ చేసి సమాచారాన్ని పోలీసులకు తెలిపినట్లు పేర్కొన్నారు. సీఐ వెంకటేశ్వర్లు బాధితుడుని అనంతపురం సర్వజన అస్పత్రికి తరలించారు. తన ద్విచక్రవాహనా న్ని కిడ్నాపర్లు ఎత్తుకెళ్లినట్లు పోలీసులకు బాధితుడు తెలిపారు.

ఎందుకీ కిడ్నాప్..?

చిరు వ్యాపారి కుళ్లాయప్పను పట్టపగలే ఎందుకు కిడ్నాప్ చేశారనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. కిడ్నాప్‌నకు ఉపయోగించిన కారు అనంతపురంలోని జనశక్తినగర్‌లో నివాసంటున్న ఓ వీఆర్వో పేరుమీద ఉన్నట్లు పోలీసులు విచారణలో తేలింది. అయితే ఆ వీఆర్వోను విచారించగా అదే కాలనీకి చెందిన అనిల్ అనే వ్యక్తి తన పేరుమీద కారు కొనుగోలు చేసినట్లు దర్యాప్తులో తేలింది. అనిల్‌ను పోలీసులు విచారణ చేయగా ఆరు నెలల కిందట నగరంలోని ఓ ప్రైవేటు డ్రైవింగ్ స్కూలుకు లీజుకు ఇచ్చినట్లు సమాచారం. ఈ నెల 19న నలుగురు వ్యక్తులు ఆ డ్రైవింగ్ స్కూలు వద్దకు వెళ్లి తమ ఆధార్ కార్డులు, డ్రైవింగ్ లైసెన్స్ ఇచ్చి, వారి ద్విచక్రవాహనంను డిపాజిట్టు చేసి కారును అద్దెకు తీసుకుని, అదే కారును కిడ్నాప్‌నకు ఉపయోగించారు. నిందితుల వివరాలను పోలీసులు ఇప్పటికే రాబట్టినట్లు తెలిసింది. ప్రత్యేక టీంను ఏర్పాటు చేసి గాలింపు చర్యలు చేపడుతున్నట్లు పోలీసుల వర్గాల ద్వారా అందిన సమాచారం. బుక్కరాయసముద్రం పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

జీడిపల్లికి 1,233 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

బెళుగుప్ప, ఆగస్టు 21 : మండలంలోని జీడిపల్లి రిజర్వాయర్‌కు 1233 క్యూసెక్కుల కృష్ణాజలాల ఇన్‌ఫ్లో వస్తున్నట్లు హంద్రీనీవా అధికారులు బుధవారం తెలిపారు. ప్రస్తుతం రిజర్వాయర్‌లో 0.886 టీఎంసీల నీటి నిల్వ ఉందన్నారు.

25లోగా దరఖాస్తు చేసుకోండి: డీఈఓ

అనంతపురం విద్య, ఆగస్టు 21: జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఈ నెల 25వ తేదీలోపు దరఖాస్తులు అందజేయాలని డీఈఓ వరలక్ష్మి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ, జడ్పీ, మున్సిపల్ ప్రైమరీ, అప్పర్‌ప్రైమరీ, హైస్కూళ్లలోని ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయుల నుంచి 2024 ఏడాదికి సంబంధించి దరఖాస్తులను స్వీకరిస్తున్నామని పేర్కొన్నారు. పూర్తి చేసిన దరఖాస్తులను రెండు సెట్లు ఈనెల 25వ తేదీ సాయంత్రం 5 గంటల్లోగా సంబంధిత ఎంఈఓ, డిప్యూటీ డీఈఓ ఆఫీసుల్లో అందజేయాలన్నారు. దరఖాస్తుదారులకు కనీసం 15 ఏళ్ల బోధనానుభవం ఉండాలని, ఎలాంటి క్రిమినల్ కేసులు, ఆర్టికల్ ఆఫ్ చార్జ్స్, శాఖాపరమైన క్రమశిక్షణ చర్యలు ఉండకూడదన్నారు.

ఉద్యోగాల కోసం దరఖాస్తు చేసుకోండి

పుట్టపర్తిరూరల్, ఆగస్టు 21: జెన్‌ప్యాక్ట్ (ఎంఎన్‌సీ) కంపెనీలో కంటెంట్ మోడరేషన్, కస్టమర్ సర్వీసెస్, వాయిస్ సపోర్టు విభాగాల్లో 1500 ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి అబ్దుల్‌ఖయ్యూమ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. బీటెక్, ఏదేని డిగ్రీ పూర్తి చేసి 2022, 2023, 2024 సంవత్సరాల్లో పాసైన విద్యార్థులు అర్హులన్నారు. ఈనెల 24వ తేదీలోపు దరఖాస్తులను హెచ్‌టీటీపీఎస్://బీఐటీ.ఎల్‌వై/46డబ్ల్యూజడ్‌క్యూజడ్6 లింక్ ద్వారా వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. దరఖాస్తు చేసుకున్న వారికి ఇంటర్వ్యూ జరిగే తేదీ, స్థలం తదితర వివరాలను తెలియజేయడం జరుగుతుందన్నారు. మరింత సమాచారం కోసం 9988853335ను సంప్రదించాలని కోరారు.

అనంతపురం డీఎస్పీ బదిలీ

అనంతపురం క్రైం, ఆగస్టు 21: అనంతపురం డీఎస్పీ టీవీవీ ప్రతాప్ బదిలీ అయ్యారు. ఆయనను ఏసీబీకి బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన స్థానంలో ఇంకా ఎవరినీ నియమించలేదు. 14వ బెటాలియన్ డీఎస్పీగా ప్రసాద్‌రెడ్డిని నియమించారు.

బీపీఓ ఉద్యోగాలకు మేళా

అనంతపురం సెంట్రల్, ఆగస్టు 21: వివిధ సంస్థల్లోని బీపీఓ ఉద్యోగాలకు జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు కేఎస్ఎన్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శంకరయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉద్యోగాలకు ఎంపికైన వారికి నెలకు రూ.20వేల నుంచి రూ.25వేల జీతం చెల్లిస్తారని పేర్కొన్నారు. ఇంటర్, డిగ్రీ విద్యార్థులు అర్హులని వివరించారు. 27న కళాశాలలో నిర్వహించే మేళాను ఉమ్మడి జిల్లాలోని నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు 8106399029, 8790172463, 778060993 నెంబర్లకు సంప్రదించాలని సూచించారు.

ఘనంగా రాఘవేంద్రుడి ఆరాధనోత్సవాలు



ధర్మవరం, ఆగస్టు 21 : పట్టణంలోని బత్తలపల్లి రహదారి పక్కన ఉన్న మారుతీ రాఘవేంద్రస్వామి ఆలయంలో ఆరాధనోత్సవాలను ఆలయ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు రాఘవేంద్రస్వామి మూలవిరాట్‌ను వివిధ రకాల పూలతో అలంకరించి పూజలు చేశారు. అనంతరం గణపతిపూజ, కలసపూజ, నవగ్రహ పూజను నిర్వహించారు. అనంతరం స్వామివారికి పల్లకోత్సం కార్యక్రమాన్ని అంగరంగవైభవంగా నిర్వహించారు.

తాగునీటి సమస్య పరిష్కారం

నల్లమాడ , ఆగస్టు 21 : మండలంలోని చౌటకుంటపల్లిలో అరు నెలలుగా తాగునీటి సమస్యతో ఆ గ్రామస్థులు ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై ఆంధ్రజ్యోతి బుధవారం ఓ కథనాన్ని ప్రచురించింది. స్పందించిన పంచాయతీ కార్యదర్శి మహమ్మద్ బేగ్ ఆ గ్రామాన్ని సందర్శించారు. నూతన బోరు నుంచి గ్రామంలోకి వెళ్లే పాత పైపులైన్‌కు కనెక్షన్ ఇప్పించి, గ్రామంలోకి నీరు సరఫరా అయ్యేలా చర్యలు చేపట్టారు. దీంతో నీటి సమస్య పరిష్కారమైంది.



పైపులైన్ వేస్తున్న సిబ్బంది

రేపటి గ్రామసభలకు హాజరుకండి

పుట్టపర్తిరూరల్, ఆగస్టు 21 : మండలంలోని అన్ని గ్రామపంచాయతీల్లో ఉపాధి హామీ పథకానికి సంబంధించి పనులను గుర్తించడానికి శుక్రవారం గ్రామసభలు నిర్వహిస్తున్నామని, సంబంధించిన అధికారులందరూ తప్పక హాజరుకావాలని ఎంపీడీఓ నాగేశ్వరరెడ్డి బుధవారం పేర్కొన్నారు. ఉపాధి హామీ పథకానికి సంబంధించి 46 పనులను గుర్తించడానికి అన్ని గ్రామపంచాయతీల్లో ఆ గ్రామ పంచాయతీ సర్పంచుల అధ్యక్షతన ఈ గ్రామసభలు నిర్వహిస్తామన్నారు. ఇందుకు సంబంధించిన గ్రామపంచాయతీ కార్యదర్శి, ఏపీఓ, ఈసీ, టీఏ, ఎఫ్ఏలు, గ్రామ మండల స్థాయి అధికారులు వారి వారి గ్రామపంచాయతీల్లో నిర్వహించే గ్రామసభలకు హాజరుకావాలన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ధర్మవరంరూరల్ : మండలంలోని 20 పంచాయతీల్లో శుక్రవారం ఉపాధిహామీ పనుల గుర్తింపు, ప్రణాళికప్రక్రియ, అభివృద్ధి పనులపై గ్రామసర్పంచ్ అధ్యక్షతన గ్రామసభలు నిర్వహించాలని ఇన్‌చార్జి ఎంపీడీఓ అబ్దుల్‌నబీ బుధవారం ఓప్రకటనలో తెలిపారు. మండలవ్యాప్తంగా రూ. మూడు కోట్లతో గ్రామాల్లో సీసీరోడ్లు నిర్మించడానికి ఇప్పటికే ప్రతిపాదనలు సిద్ధం చేశామన్నారు. వీటిపై గ్రామసభలో ఆమోదం తెలపాలన్నారు. అదేవిధంగా ఉపాధి హామీలో 38 రకాల వ్యవసాయ అనుబంధ పనుల జాబితా, రైతుల అవసరాల మేరకు ప్రతిపాదనలు సిద్ధం చేసి ఆమోదం తెలుపుకోవచ్చున్నారు. కావున రైతులు, ఉపాధిహామీ కూలీలు, గ్రామస్థులు ఈ గ్రామసభలకు హాజరుకావాలని తెలిపారు.

కొత్తచెరువు : ఉపాధి పథకం కింద 2024-25 ఆర్థిక సంవత్సరానికి కొత్త పనులను ఎంపిక చేయడానికి శుక్రవారం ఆయా పంచాయతీ కేంద్రాల్లో గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు ఆ శాఖ ఏపీఓ నాగిరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని 15 పంచాయతీల్లో ఉదయం 10.30 గంటలకు నిర్వహించే ఈ గ్రామసభలు నిర్వహిస్తారన్నారు.

నల్లమాడ: మండలంలోని 14 పంచాయతీల్లో శుక్రవారం గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ కొండన్న తెలిపారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ... ఉపాధి హామ పథకంలో నూతన పనుల ఎంపిక కోసం ఈసభలు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ గ్రామసభలకు గ్రామస్థులు, ఉపాధి సిబ్బంది, కూలీలు హాజరుకావాలన్నారు. ఈ సమావేశంలో ఏపీఓ సూర్యనారాయణ, ఈసీ షేక్షావలీ, ఈఓఆర్‌డీ అమరనాథ్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, ఉపాధి సిబ్బంది, మండలాధికారులు పాల్గొన్నారు.

గాండ్లపెంట : మండలంలోని 14 పంచాయతీల్లో ఉపాధి పనులపై గ్రామసభలను శుక్రవారం నిర్వహించనున్నట్లు ఎంపీఓ మంజునాథ్ బుధవారం తెలిపారు. ఈ సభలో నూతన పనుల కోసం గ్రామసభలో అధికారులకు తెలపాలని, ప్రణాళికలను ఉన్నతాధికారులకు పంపుతామని అన్నారు.

ఆర్డీ సొమ్ము గల్లంతు


మాట్లాడుతున్న చిన్నమ్మ

ఓబుళదేవరచెరువు : మండలంలోని కొండకమర్ల పోస్టాఫీసులో తన ఆర్డీ సొమ్ము నుంచి రూ. 14 వేలను సిబ్బంది స్వాహా చేసినట్లు మండలంలోని వీరప్పగారిపల్లికి చెందిన పి. చిన్నమ్మ వాపోయారు. బుధవారం ఆమె మాట్లాడుతూ.. 2019 డిసెంబరు నుంచి ప్రతి నెలా రూ. ఐదువందలు పోస్టాఫీసులో ఆర్డీ కడుతున్నానని, ఈనెల 5న రూ.14 వేలు తను అనుమతి లేకుండానే సిబ్బంది డ్రా చేశారని వాపోయారు. ఈ విషయాన్ని గుర్తించి పోస్టాఫీసుకెళ్లి అధికారులను అడిగితే.. తానే సంతకం పెట్టి డ్రా చేసి ఉంటానని దబాయిస్తున్నట్లు బాధపడ్డారు. తనకు జరిగిన అన్యాయాన్ని ఉన్నతాధికారులు గుర్తించి, తనకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

సీఐ బాధ్యతల స్వీకరణ



కొత్తచెరువు, ఆగస్టు 21 : పుట్టపర్తి రూరల్ సీఐగా సురేశ్ బుధవారం కొత్తచెరువు సర్కిల్ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. ఆయన చిత్తూరు జిల్లా నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చారు. పుట్టపర్తి రూరల్ సీఐ రాగిరి రామయ్య సత్యసాయి జిల్లా వీఆర్‌కు బదిలీ అయ్యారు.

గాలికుంటు వ్యాధి టీకాలను సద్వినియోగం చేసుకోండి

పుట్టపర్తి, ఆగస్టు 21: పశువులకు గాలికుంటు వ్యాధి రాకుండా ప్రభుత్వం అందిస్తున్న టీకాలను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టరు టీఎస్ చేతన్ కోరారు. బుధవారం కలెక్టరేట్లో జాతీయ పశువ్యాధి నియంత్రణ పథకం వాల్‌పోస్టర్లను ఆవిష్కరించిన ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమాన్ని వచ్చే నెల 18వ తేదీ వరకు నిర్వహిస్తామని అన్నారు. కార్యక్రమంలో పశుసంవర్ధకశాఖ ఏడీ శుభదాసు, డాక్టర్ కృష్ణ చైతన్య, పశువైద్యులు సత్య ప్రకాష్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఎయిడ్స్ కట్టడిపై అవగాహన

నల్లమాడ: ఎయిడ్స్ వ్యాధి కట్టడిపై స్థానిక జూనియర్ కళాశాలలో విద్యార్థులకు జన జాగృతి సంస్థ ఆధ్వర్యంలో బుధవారం అవగాహన కల్పించారు. ఎయిడ్స్ వ్యాధి వచ్చే విధానం, నివారణ చర్యల గురించి వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ ఉదయ్‌కుమార్, ఐసీటీసీ కౌన్సిలర్ అక్బర్‌బాషా, ఎల్‌టీ రాఘవేంద్ర, జనజాగృతి ప్రాజెక్టు మేనేజర్ శ్రీనివాసులు, ఓఆర్‌డబ్ల్యూ నీరజ, శ్రీవాణీ, శిల్ప, శాంతమ్మ, విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఈ-పంట నమోదు తప్పనిసరి

ధర్మవరం రూరల్ : ఖరీఫ్‌లో పంటలు సాగుచేసిన రైతులందరూ తప్పనిసరిగా ఈ-పంట నమోదు చేయించుకోవాలని, అప్పుడే ప్రభుత్వ రాయితీలు వర్తిస్తాయని జిల్లా వ్యవసాయాధికారి సుబ్బారావు సూచించారు. బుధవారం మండలంలోని పోతులనాగేపల్లి గ్రామ పొలాల్లో ఈ పంటనమోదు కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ప్రస్తుతం కురిసిన వర్షాలకు పంటల పరిస్థితి ఆశాజనకంగా ఉందన్నారు. ఖరీఫ్‌లో సాగుచేసుకోని రైతులకు త్వరలోనే ప్రత్యామ్నాయ విత్తనాలు పెసలు, అలసంద, ఉలవలు పంపిణీ చేస్తామన్నారు. ఆయన వెంట ఏడీఏ క్రిష్ణయ్య, రైతు సేవా కేంద్రం సిబ్బంది పూర్ణిమ, రైతులు ఉన్నారు.

ఉపాధిని వ్యవసాయానికి అనుసంధానం చేయాలి

ధర్మవరం, ఆగస్టు 21 : ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు జంగాలపల్లి పెద్దన్న ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడుతూ.... శుక్రవా రం రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో గ్రామసభలు నిర్వహిస్తోందన్నారు. ఉపాధి హామీ పథకం పనిదినాలు 200 రోజులకు పెంచాలని, వేతనం రూ.600 ఇవ్వాలని, సరిపడే పనిముట్లు ప్రభుత్వం సమకూర్చాలని కోరారు. ఇతర రాష్ట్రాలకు వలసలు వెళ్లిన కూలీలను తిరిగి స్వగ్రామాలకు రప్పించి... వారందరికి జాబ్‌కార్డులు ఇచ్చి పనులు కల్పించాలన్నారు. అన్ని గ్రామీణ ప్రాంతాల్లో చిన్నసన్నకారు రైతులు, పేదలు పాల్గొని గ్రామ సభల్లో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ఈ సమావేశంలో సీఐటీయూ కన్వీనర్ జేవీ రమణ, సీఐటీయూ సీనియర్ నాయకులు ఎస్‌హెచ్‌బాషా, సీపీఎం పట్టణ కార్యదర్శి శేషంపల్లి మారుతి, చేనేత నాయకులు వెంకటస్వామి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏపీ రైతు సంఘం నాయకులు


ధర్మవరంలో మోకాళ్లపై నిలబడి నిరసన



ధర్మవరంలో హజరత్ టిప్పుసుల్తాన్ జేఏసీ నాయకుల ర్యాలీ


తలుపులలో కొవ్వొత్తులతో నిరసన

దోషులను కఠినంగా శిక్షించాలి

ఆంధ్రజ్యోతి, న్యూస్ నెట్‌వర్క్ : కోల్‌కతాలో జూనియర్ డాక్టర్‌ను అత్యాచారం చేసి, హత్య చేసిన దోషులను కఠినంగా శిక్షించాలని జిల్లా వ్యాప్తంగా నిరసనలు బుధవారమూ కొనసాగాయి. కదిరిలో సీఐటీయూ ఆధ్వర్యంలో అంబేడ్కర్ సర్కిల్‌లో నిరసన తెలిపారు. ధర్మవరంలో కళాజ్యోతి సర్కిల్‌లో అంబేడ్కర్ విగ్రహం వద్ద మోకాళ్లపై నిలబడి సీఐటీయూ నాయకులు, అంగన్ వాడీలు నిరసన తెలిపారు. అలాగే హజరత్ టిప్పుసుల్తాన్ జేఏసీ నాయకులు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. తలుపులలో కొవ్వొత్తులతో నిరసన తెలిపారు. ముదిగుబ్బలో సీపీఎం, సీఐటీయూ, అంగన్‌వాడీ కార్యకర్తలు జాతీయ రహదారిపై ధర్నా నిర్వహించారు. తనకల్లులో ఆర్డీటీ ఆధ్వర్యంలో శ్రీగోవిందునరసింహారెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు, ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బంది నిరసన ర్యాలీ చేపట్టారు. అమడగూరు జూనియర్ కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు నిరసన ర్యాలీ నిర్వహించారు.


కదిరి అంబేడ్కర్ సర్కిల్‌లో కొవ్వొత్తులతో నిరసన


ముదిగుబ్బలో ధర్నా చేస్తున్న సీపీఎం, సీఐటీయూ, అంగన్‌వాడీ కార్యకర్తలు


తనకల్లులో నిర్వహిస్తున్న ర్యాలీ


అమడగూరులో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

వృథా అవుతున్న చెరువు నీరు

ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు

తనకల్లు, ఆగస్టు 21: మండలంలోని చిన్నరామన్నగారిపల్లి చెరువులోకి ఇటీవల కురిసిన వర్షానికి నీరు వచ్చాయి. అయితే వచ్చిన నీరు వచ్చినట్లుగానే తూము నుంచి బయటకు వృథాగా పోతున్నాయి. ఈ విషయాన్ని పలు మార్లు సంబంధిత అధికారులుకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని ఆ గ్రామస్థులు, సర్పంచ్ క్రిష్టారెడ్డి వాపోతున్నారు. నీరు వృథా కాకుండా తాము చేసిన ప్రయత్నాలు ఫలించలేదన్నారు. అసలే బోర్లలో నీరు రాక ఇబ్బందులు పడుతున్న సమయంలో చెరువులోకి నీరు రావడం ఆనందంగా ఉందని, కాని అలా వచ్చిన నీరు వృథా అవుతుంటే బాధగా ఉందని వాపోతున్నారు. అధికారులు స్పందించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.


తూము నుంచి వృథా అవుతున్న నీరు

విద్యార్థులకు పరుగు పందేలు

కొత్తచెరువు, ఆగస్టు 21 : పుట్టపర్తి, బుక్కపట్నం, కొత్తచెరువు మండలాల ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడామైదానంలో ఆత్మీయ ట్రస్టు ఆధ్వర్యంలో బుధవారం పరుగు పందెం పోటీలు నిర్వహించారు. అండర్-14, 17 విభాగాలల్లో 100, 200 మీటర్ల పరుగు పందెం పోటీలు నిర్వహించారు. జిల్లా విద్యాశాఖ అధికారిణి మీనాక్షి ప్రారంభించిన ఈ పోటీల్లో 265 మంది విద్యార్థులు పాల్గొన్నారు. విజేత విద్యార్థులకు ప్రశంసా పత్రాలతో పాటు మెడల్స్‌ను డీఈఓ అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓలు జాన్‌రెడ్డప్ప, జయచంద్ర, ఆత్మీయట్రస్టు ఛైర్మన్ శెట్టిపి జయచంద్రారెడ్డి, యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం సుధాకర్, టోర్నమెంట్ కన్వీనర్ వెంకటరమణ, ఏఎంఓ మహేం ద్రారెడ్డి, ఏపీటీఎఫ్ 1938 అధ్యక్షుడు హరిప్రసాద్‌రెడ్డి, ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు హరిప్రసాద్‌రెడ్డి, యూటీఎఫ్ నాయకులు లక్ష్మీనారాయణ, బాబు, మురళి, చాంద్‌బాషా, నగేశ్, కిష్టప్ప, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.


విజేత విద్యార్థులతో ఆత్మయ ట్రస్టు సభ్యులు, ఉపాధ్యాయులు

కబ్జారాయుళ్లపై చర్యలు తీసుకోండి: టీడీపీ

ధర్మవరం, ఆగస్టు 21 : పట్టణంలోని మొదటి వార్డు గూడ్‌షెడ్ కొట్టాలలో గత టీడీపీ ప్రభుత్వంలో పేదలకు ఇచ్చిన పట్టాలను ఆక్రమించుకుని సొమ్ము చేసుకుంటున్న కబ్జారాయుళ్లపై చర్యలు తీసుకోవాలని టీడీపీ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం ఈ మేరకు తహసీల్దార్ నటరాజ్‌కు వినతిపత్రం అందజేసిన వారు మాట్లాడారు. గూడ్‌షెడ్ కొట్టాలలో ఉన్న కుణుతూరు పొలం సర్వే నెంబరులో 560లో నాడు టీడీపీ ప్రభుత్వం హమాలీలు, పేదలకు పట్టాలు ఇవ్వడంతో పాటు గుడి, బడికి కేటాయించిన స్థలాన్నీ వైసీపీ నాయకులు కబ్జా చేశారు. రెవెన్యూ అధికారులను అడ్డంపెట్టుకుని పొజిషియన్ సర్టిఫికెట్లను సృష్టించుకుని పేదల పట్టాలను అమ్మి సొమ్ము చేసుకున్నారన్నారు. వాటిని విచారించి గతంలో ఇచ్చిన పట్టాలను వారికే ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని తహసీల్దార్‌ను కోరారు. తహసీల్దార్‌ను కలిసిన వారిలో టీడీపీ నాయకులు కమతం కాటమయ్య, చింతలపల్లి మహేశ్‌చౌదరి, పరిశే సుధాకర్, పురుషోత్తంగౌడ్, రాళ్లపల్లి షరీఫ్, నాగూర్ హుస్సేన్, అత్తర్‌రహీం, బత్తల గంగాధర్, హోటల్ మారుతీస్వామి, షఫీ ఉన్నారు.


తహసీల్దార్‌కు వినతిపత్రాన్ని ఇస్తున్న టీడీపీ నాయకులు

ఆలయ భూములు కాపాడండి

బుక్కపట్నం, ఆగస్టు 21: బుక్కపట్నానికి చెందిన బసవేశ్వస్వామి ఆలయ భూముల అన్యాక్రాంతం అవుతున్నాయని, వాటిని కాపావాలని తహసీల్దార్ షాబుద్దీన్‌కు ఆయల కమిటీ సభ్యులు బుధవారం వినతిపత్రం అందించారు. గ్రామ సమీపంలోని సర్వేనెంబర్ 1414లో నాలుగు ఎకరాల బసవేశ్వరస్వామి ఆలయానికి చెందిన భూమి ఉందని, దాన్ని కొంతమంది అక్రమించుకోవాలని చూస్తున్నారని తెలిపారు. అలాగే మండల వ్యాప్తంగా ఆలయాలకు చెందిన భూములను గుర్తించి దేవదాయ శాఖకు చెందేలా చర్యలు చేపట్టలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రెసిడెంట్ దేరిశెట్టి సంజీవరాయుడు, కమిటీ సభ్యులు నాగభూషణం, దాసరి శ్రీనివాసులు, గాజుల బాలాజీ, ఈశ్వరప్ప, సతీష్, చంద్ర, ఆదినారాయణ, పురుషోత్తమ, గ్రామస్థులు పాల్గొన్నారు.


తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం చేయండి

ధర్మవరం, ఆగస్టు 21 : సీజనల్, అతిసార వ్యాధులపై ప్రజలను అప్రమత్తం చేయాలని మున్సిపల్ కమిషనర్ రాంకుమార్, మలేరియా సబ్‌యూనిట్ అధికారి జయరాంనాయక్ పేర్కొన్నారు. మున్సిపల్ కార్యాలయంలోని సమావేశం భవనంలో ఏఎన్ఎం, ఇతర అధికారులతో బుధవారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటిస్తే రోగాలు దరిచేరవన్నారు. సీజనల్ వ్యాధులు వ్యాప్తిని నివారించడానికి చిట్కాలతో పాటు ఆరోగ్యపర్యవేక్షణ ప్రణాళికలను వివరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ కార్యాలయ నియోజకవర్గ ఇన్‌చార్జి హరీశ్, డీపీఎంఓ చిన్నకుల్లాయప్పనాయక్, అసిస్టెంట్ కమిషనర్ మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

తనకల్లు, ఆగస్టు 21: స్థానిక సాధియా ప్రైవేటు ఆసుపత్రిలో అనంతపురం మార్కు ఆసుపత్రికి చెందిన గుండె వైద్యులు ఉచిత వైద్య శిబిరాన్ని బుధవారం నిర్వహించారు. మండలంలోని వివిధ గ్రామల నుంచి గుండె జబ్బులున్న వారు వచ్చి ఉచితంగా పరీక్షలు చేయించుకున్నారు. రూ.మూడు వేల విలువైన వైద్యపరీక్షలను ఉచితంగా నిర్వహించినట్లు డాక్టర్ సాధియా తెలిపారు. ఈకార్యక్రమంలో అనంతపురం మార్కు ఆసుపత్రి డాక్టర్లు, ప్రభుత్వవైద్యులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ ఆందోళన

కదిరి అర్బన్, ఆగస్టు 21: ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ మాలమహానాడు ఆధ్వర్యంలో బుధవారం స్థానిక అంబేడ్కర్ సర్కిల్‌లో ఆందోళన చేపట్టారు. ఎస్సీవర్గీకరణ సుప్రీం కోర్టు అనుమతిస్తూ ఇచ్చిన తీర్పును వ్యతిరేకిస్తూ దేశవ్యాప్తంగా మాలలు నిరసన కార్యక్రమాలు చేపట్టారన్నారు. అందులో భాగంగా ఇక్కడ కూడా అందోళన చేపట్టామన్నారు. అంబేడ్కర్ సర్కిల్ నుంచి కూరగాయాల మార్కెట్ వరకు ర్యాలీ నిర్వహించారు. రిజర్వేషన్‌లో ప్రస్తుతమున్న కోటాను యథాతథంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వలు ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాలమహానాడు నాయకులు పిచ్చల రామచంద్ర, గోపాల్, రామచంద్ర, కదిరప్ప, నరేష్, త్యాగరాజు, చంద్రమౌళి, బాల వేమయ్య, అంజనేయులు పాల్గొన్నారు.

విలేకరిపై కాల్‌మనీ కేసు

కదిరి, ఆగస్టు 21: పట్టణంలో ఓ చానల్ విలేకరి సుల్తాన్ అలియాజ్ లాలీపై రెండు కేసులు నమోదు చేసినట్లు పట్టణ సీఐ నారాయణరెడ్డి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. కూరగాయాల మార్కెట్ సమీపంలోని గాజుల వీధిలో ఉండే డ్రైవర్ షేక్ ఉమ్మర్ ఫారూక్‌కు విలేకరి రూ. రెండు లక్షలు అప్పుగా ఇచ్చాడు. ఆ సమయంలో బాండ్‌తో పాటు ఖాళీ చెక్కుపై బలవంతంగా సంతకాలు తీసుకున్నాడు. రూ. వందకు నెల రూ. 15 వడ్డీతో రూ. రెండు లక్షలకు గాను రూ. నాలుగు లక్షలు వసూలు చేశారు. ఇంకా అప్పు తీరలేదని, తాను చెప్పినంత డబ్బులు కట్టాలని, లేకుంటే అంతు చూస్తానని బెదిరించాడు. దీంతో బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు సుల్తాన్ అలియాజ్ లాలీపై సెక్షన్ 308(5), బీఎన్ఎస్ కింద నమోదు చేశారు. అలాగే వలీసాబ్‌రోడ్డులోని షామీరియా వీధిలో ఉన్న షేక్‌సనావుల్లాకు సుల్తాన్ రూ. లక్ష అప్పు ఇచ్చాడు. నెలకు రూ.20 వేలు వంతున 8 నెలలు వడ్డీ వసూలు చేసుకున్నాడు. ఇంకా అప్పు తీరలేదని, డబ్బులు కట్టాలని బెదిరించారు. బాధితుని ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఇతర నగరాల్లో వివిధ వ్యాపారాల పేరుతో పలువురికి అప్పులించి వారి కట్టలేని పక్షంలో వారిని రకరకాలుగా ఇబ్బందులు పెడుతున్నట్లు సమాచారం. విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని సీఐ పేర్కొన్నారు.

కౌన్సెలింగ్‌లో లోపాలను సరిచేయండి

కొత్తచెరువు, ఆగస్టు 21 : ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్న ఉపాధ్యాయుల పని సర్దుబాటు కౌన్సెలింగ్‌లో లోపాలను సరి చేయాలని ఎస్టీయూ నాయకులు కోరుతున్నారు. ఈ మేరకు విద్యాశాఖ ఏడీ నాగరాజుకు బుధవారం సాయంత్రం వినతిపత్రం అందజేశారు. సీనియార్టీ ప్రకారం కౌన్సెలింగ్ చేపట్టాలన్నారు. డీఎస్సీ ఉపాధ్యాయులను మెరిట్‌కమ్ రోస్టర్ విధానం ద్వారా సీనియార్టీ లిస్టు ప్రకారం కౌన్సెలింగ్ నిర్వహించాలన్నారు. కానీ చాలా మండలాల్లో ఈ విధానం అమలు కావడం లేదని, దాని వల్ల ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. జిల్లాలో చాలా పాఠశాలలో 21 మంది విద్యార్థులున్న నిబంధనలకు విరుద్ధంగా ఒక్క ఉపాధ్యాయుడును సర్‌ప్లస్‌గా చూపుతున్నారని, దానిని సరిదిద్ది ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని అన్నారు.

'ప్రశాంతి' కమిటీ ఏకగ్రీవం

పుట్టపర్తి, ఆగస్టు 21 : ప్రశాంతి పట్టణ సమాఖ్య కమిటీని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పట్టణంలోని మెప్మా కార్యాలయంలో సీఎంఎం రమాదేవి ఆధ్వర్యంలో మహిళా సమాఖ్య సమావేశం నిర్వహించారు. అధ్యక్షురాలుగా పద్మావతి, ఉపాధ్యక్షులుగా మీనా, కార్యదర్శిగా రామతులసి, కోశాధికారి ఇందిరమ్మ, ఉపకార్యదర్శిగా రాజేశ్వరిను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సీఈఓ ఆదినారాయణ పాల్గొన్నారు.

పొలం విషయంలో ఘర్షణ

కదిరి అర్బన్, ఆగస్టు 21: మండలంలోని యాకాల చెరువు కొత్తపల్లిలో పొలం విషంలో రెండు కుటుంబాలు బుధవారం ఘర్షణపడ్డాయి. గ్రామంలోని మీసాల రెడ్డెప్ప, ఈశ్వరయ్య కుటుంబాల మధ్య నాలుగేళ్లగా పొలం విషయంలో వివాదాలున్నాయి. కాగా బుధవారం రెడ్డెప్పపై ఈశ్వరయ్య అతని కుమారుడు నాగార్జున, జానకి దాడిచేశారు. బాధితుని ఫిర్యాదు మేరకు ఆ ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు రూరల్ సీఐ మోహన్ తెలిపారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన

కదిరి అర్బన్ : స్థానిక జిల్లాపరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో బుధవారం మధ్యాహ్న భోజనాన్ని ఎస్ఎంసీ ఛైర్‌పర్సన్ సుజాత పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఏజెన్సీలకు సూచించారు. భోజనం గురించి విద్యార్థులతో ఆరా తీశారు. పాఠశాల ఆవరణంలో వర్షపు నీరు నిలువ ఉండడంతో మట్టిని తొలించాలని సూచించారు.

దరఖాస్తు చేసుకోండి

ముదిగుబ్బ, ఆగస్టు 21 : స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఖాళీగా ఉన్న జువాలజీ, కామర్స్ సబ్జెక్టుల అతిథి అధ్యాపకుల పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని ఆ కళాశాల ప్రిన్సిపల్ రామరాజు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సబ్జెక్టులు బోధించ డానికి పోస్టు గ్రాడ్యుయేషన్‌లో 50 శాతం మార్కులు కలిగిన వారు అర్హులని.. ఈ నెల 27 లోగా సర్టిఫికెట్ల నకలు, బయోడేటాను కళాశాలలో అందజేయాలని అన్నారు. ఈ నెల 29న ఒరిజినల్ సర్టిఫికెట్లతో కళాశాలకు హాజరు కావాలని తెలిపారు.

పంచాయతీలకు నిధుల విడుదలపై హర్షం

తాడిమర్రి, ఆగస్టు 21 : రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు గ్రామ పంచాయతీల అభివృద్ధికి ఆర్థిక సంఘం నిధులు విడుదల చేయడంపై ఉమ్మడి జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు గోనుగుంట్ల భూషణ్ హర్షం వ్యక్తం చేశారు. చంద్రబాబు గ్రామ పంచాయతీలకు రూ.950 కోట్లు, జలజీవన్ మిషన్‌కు రూ.500 కోట్లు విడుదల చేస్తూ జీఓ విడుదల చేశారన్నారు. వైసీపీ ప్రభుత్వంలో కేవలం సర్పంచ్‌లుగా ఎన్నుకోవడమే కానీ గ్రామాల అభివృద్ధికి ఒక్క పైసా కూడా ఖర్చు చేయలేకపోయిందన్నారు. ఇక నుంచి గ్రామాలను అభివృద్ధి బాట పట్టించేందుకు కృషిచేస్తామని అన్నారు.


ఆలయం వద్ద భక్తుల సందడి


మూలవిరాట్టు

భక్తిశ్రద్ధలతో విగ్రహ ప్రతిష్ఠ

పెనుకొండ, ఆగస్టు 21 : పట్టణంలోని గొల్లపాళ్యంలో విగ్రహప్రతిష్ఠ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వెంకటేశ్వరస్వామి, యల్లమ్మ దేవత ఆలయాలు శిథిలావస్థకు చేరుకోవడంతో యాదవ సంఘం ఆధ్వర్యంలో ఆలయాల జీర్ణోద్ధరణ చేపట్టారు. వెంకటరమణ స్వామి, యల్లమ్మ విగ్రహాలతో పాటు 18 అడుగుల ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠించారు. అర్చక రత్న పంచాంగం శేషప్పస్వామి ఆధ్వర్యంలో విగ్రహ ప్రాణప్రతిష్ఠ కార్యక్రమాలు హోమాలు, పంచామృతాభిషేకం, పుష్పాలంకరణ, పూర్ణాహుతి, యల్లమ్మతల్లికి మాంగల్యధారణ, తీర్థ ప్రసాద వినియోగం, అన్నసంతర్పణ చేపట్టారు. కార్యక్రమానికి అధిక సంఖ్యలో భక్తులు హాజరయ్యారు.

ఆలయానికి హుండీ విరాళం


హుండీని అందజేస్తున్న దాత బంగారు చంద్ర

హిందూపురం(పరిగి), ఆగస్టు 21 : ఆలయానికి భక్తులు హుండీని విరాళంగా అందజేశారు. కొడిగెనహళ్లిలో వెలసిన గ్రామదేవత యల్లమ్మ దేవస్థానానికి బీజేపీ మండల అధ్యక్షులు బంగారు చంద్ర బుధవారం రూ.10వేలు విలువచేసే హుండీ విరాళంగా అందించారు. పూజారి నారాయణప్ప ఆయన్ని ప్రత్యేక పూజలతో ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ కార్యకర్తలు సంజీవమూర్తి, సునీల్, సాయి, మధు, భీమేష్, మమేష్, బాలు, సుబ్బు, శివాలయ అర్చకులు చేతన్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా మధ్యారాధన

పెనుకొండ, ఆగస్టు 21 : స్థానిక మంత్రాలయ రాఘవేంద్ర మఠంలో స్వామివారి ఆరాధనోత్సవాల్లో భాగంగా బుధవారం రెండో రోజు మధ్యారాధనను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అర్చకులు అనిల్, మేనేజర్ వరదచార్యులు ఆధ్వర్యంలో ఉదయం నిర్మాల్య విసర్జన, పంచామృతాభిషేకం, అష్టోత్తర పారాయణం, కనకమహాపూజ, తీర్థప్రసాద వినియోగం, అలంకరణ, మహామంగళహారతి, అన్నసంతర్పణ కార్యక్రమాలను నిర్వహించారు.


అలంకరణలో బృందావనం

కొంకల్లు గ్రామాన్ని సందర్శించిన ఇన్‌చార్జ్ ఆర్డీఓ

గుడిబండ, ఆగస్టు 21 : మండలంలోని కొంకల్లు గ్రామంలో అతిసార వ్యాధితో చికిత్స పొందుతున్న బాధితులను పెనుకొండ ఇన్‌చార్జ్ ఆర్డీఓ వెంకట శివరామిరెడ్డి పరామర్శించారు. బుధవారం గ్రామాన్ని సందర్శించిన ఆయన బాధితుల ఇండ్లకు వెళ్లి ఆరోగ్యపరిస్థితిపై ఆరా తీశారు. వైద్యురాలు శాంతితో వివరాలు సేకరించి మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. అనంతరం గ్రామంలో పర్యటించి పరిశుభ్రతను పరిశీలించారు. ఎంపీడీఓ రామారావు, ఈఓఆర్డీ నాగరాజునాయక్, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ హరి, ప్రకాశ్‌లతో వివరాలను అడిగి తెలుసుకున్నారు. శుభ్రత పాటించాలని సూచించారు. వీరి వెంట డీటీ రాంభూపాల్‌రెడ్డి, పంచాయతీ సిబ్బంది తదితరులు ఉన్నారు. వాంతులు, విరేచనాలకు గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులను పెనుకొండ డీవైఈఓ రంగస్వామి పరామర్శించారు.

ఘనంగా ప్రీస్కూల్ వేడుకలు

పెనుకొండ, ఆగస్టు 21 : పట్టణంలోని ఆల్విన్ కాలనీ అంగన్ వాడీ కేంద్రంలో ప్రీస్కూల్ సంసిద్ధత వేడుకలు ఘనంగా నిర్వహించారు. సూపర్వైజర్ పుష్పలత ఆధ్వర్యంలో కేంద్రంలోని విద్యార్థిని సనం సాదియ మూడేళ్లు నిండడంతో ప్రీస్కూల్‌లో పేరు నమోదు చేశారు. ఈ సందర్భంగా అంగనవాడీ కేంద్రానికి తల్లిదండ్రులు పది కుర్చీలను విరాళంగా అందించారు. కార్యకర్త రాజేశ్వరి, సహాయకులు మహబున్నీసా పాల్గొన్నారు.


సంబరాల్లో విద్యార్థులు

ప్రహరీ నిర్మించాలని వినతి


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న టీడీపీ నాయకులు

లేపాక్షి, ఆగస్టు 21 : స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి ప్రహరీ లేకపోవడంతో రోగులు, సిబ్బంది ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వెంటనే గోడ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని టీడీపీ మండల కన్వీనర్ జయప్ప తహసీల్దార్ సౌజన్యలక్ష్మీకి బుధవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో రోడ్డు వెడల్పు చేసే క్రమంలో కాంట్రాక్టర్లు ప్రభుత్వ ఆసుపత్రి ప్రహరీని ధ్వంసం చేశారన్నారు. అయితే ఇంతవరకు ప్రహరీ నిర్మించలేదని, దీంతో పశువులు, మేకలు, విషపురుగులు ఆసుపత్రి ఆవరణలోకి వస్తున్నాయన్నారు. దీంతో రోగులకు ఇబ్బంది తప్పడం లేదన్నారు. దీనిపై స్పందించిన తహసీల్దార్ సౌజన్యలక్ష్మీ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

గ్రామీణ ప్రాంతాలకు రోడ్ల సౌకర్యం కల్పించండి

పావగడ, ఆగస్టు 21 : తాలూకాలోని నిడిగల్లు హోబళికి చెందిన క్యాతగానిహళ్లి గ్రామం, చిక్కతిమ్మనహట్టి, న్యాయదకుంటె, దేవరాయలరొప్ప గ్రామాలకు వెళ్లేందుకు రోడ్లు వేయించి, రవాణాసౌకర్యం కల్పించాలని జిల్లా బీపీఎస్ (భారతీయ పరివర్తన సంఘం) జిల్లా అధ్యక్షుడు కెంచరాయ కోరారు. ఆయా గ్రామాలకు రోడ్లులేక వర్షాకాలంలో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, గర్భిణులు ఆస్పత్రులకు వెళ్లేందుకు అష్టకష్టాలు పడాల్సి వస్తుందని, ఎమ్మెల్యే వెంకటేశ్ గ్రామీణ రహదారుల మరమ్మతులపై చొరవ చూపాలని కోరారు.


మాట్లాడుతున్న కెంచరాయ

రావమ్మా..గంగమ్మా..!

● చెరువులకు జలకళతో గ్రామాల్లో హర్షం
● రైతుల ప్రత్యేక పూజలు


పొంగిపొర్లుతున్న పాలసముద్రం చెరువు


పరిగిలో గంగపూజ నిర్వహిస్తున్న తహసీల్దార్ హసీనాసుల్తానా


ఉధృతంగా ప్రవహిస్తున్న గోరంట్ల పెద్ద చెరువు

గోరంట్ల, ఆగస్టు 21: విస్తారంగా కురుస్తున్న వర్షాలతో మండలంలోని చెరువులు జలకళ సంతరించుకుంటున్నాయి. గోరంట్లలో మంగళవారం 35మి.మీ. బుధవారం 25మి.మీ.వర్షపాత నమోదయ్యింది. స్థానిక పెద్ద చెరువుకు నీటి ప్రవాహం మొదలయ్యింది. దీంతో స్థానికుల్లో ఆనందం వ్యక్తం అవుతోంది. రెండు నెలలుగా బోర్లు ఎండిపోయి పట్టణంలో నీటి సమస్య తీవ్రంగా మారిందని, చెరువు నీటితో సమస్య తీరనుందని హర్షం వ్యక్తం చేశారు. పాలసముద్రం చెరువుకు గంగ పూజ నిర్వహించారు.

హిందూపురం(పరిగి): ఎగువ కురిసిన భారీ వర్షాలకు చెరువులు జలకళ సంతరించుకుంటున్నాయి. కర్ణాటక నుంచి జయమంగళి నది పొంగి పొర్లడంతో బుధవారం పరిగి చెరువుకు నీరు చేరింది. తహసీల్దార్ హసీనాసుల్తానా శీరంగరాజులపల్లి నదిలో బుధవారం గంగపూజ నిర్వహించారు. టీడీపీ మండల కన్వీనర్ గోవిందరెడ్డి, మారుతిప్రసాద్, డీఎస్ఎల్ శ్రీనివాసులు, ప్రవీణ్‌రెడ్డి, రెవెన్యూ సిబ్బంది, పాల్గొన్నారు.


పాలసముద్రంలో గ్రామస్థుల గంగపూజ

సర్దుబాటు ప్రక్రియలో గందరగోళం

● సీనియారిటీ జాబితాపై ఉపాధ్యాయుల ఆగ్రహం

హిందూపురం అర్బన్, ఆగస్టు 21: మున్సిపల్ ఉద్యోగుల సర్దుబాటు ప్రక్రియ గందరగోళంగా మారింది. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంఈఓ గంగప్ప ఆధ్వర్యంలో ఉపాధ్యాయుల సర్దుబాలు చేపట్టారు. విద్యాశాఖ అధికారులు సర్‌ప్లస్, డిఫెక్ట్ డాటా ప్రకారం నిర్ణయించారు. అయితే క్షేత్ర స్థాయిలో వివిధ యాజమాన్యాల నుంచి తయారు చేసిన సీనియారిటీ జాబిత తప్పులు తడకగా ఉందని వారు ఎంఈఓకు వివరించారు. మున్సిపల్ యూనిట్‌లోకి ఇతర యాజమాన్యాల ఉపాధ్యాయులు రావడంపై వారు ఆందోళన వ్యక్తం చేశారు. మున్సిపల్ ఉపాధ్యాయుల సర్‌ప్లస్‌ను అదే పాఠశాలల్లో భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ జేఏసీ ఉపాధ్యాయ నాయకులు ఏపీ ఎంటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి సిద్దగిరి, శ్రీనివాసులు, చంద్రానాయక్, బాలకృష్ణ, షమీవుల్లా, గంగాధర్ ఎస్టీయూ నాయకులు పాల్గొన్నారు.

మొక్కలు నాటిన చిరంజీవి అభిమానులు

మడకశిర రూరల్, ఆగస్టు 21 : మెగాస్టార్ చిరంజీవి 69వ జన్మదిన వేడుకల సందర్భంగా చిరంజీవి, పవన్ కల్యాణ్ అభిమానులు బుధవారం రోడ్డుకు ఇరువైపులు మొక్కలు నాటారు. నియోజకవర్గ ఫ్యాన్స్ అధ్యక్షుడు వెంకటేశ్ గుప్త మాట్లాడుతూ పద్మవిభూషణ్ చిరంజీవి పుట్టిన రోజు సందర్భంగా జిల్లా అధ్యక్షుడు సురేష్ ఆదేశాలతో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టామన్నారు. అన్నదానం నిర్వహించారు. జనసేన పట్టణ అధ్యక్షుడు మనోజ్ కుమార్, నాయకులు రాధాకృష్ణ, శ్రీనివాసులు, హరి, మహేష్, సూరి తదితరులు పాల్గొన్నారు.


మొక్కలు నాటుతున్న అభిమానులు

దోషులను కఠినంగా శిక్షించాలి

● కోల్‌కతాలో వైద్యురాలిపై కిరాతక చర్యను ఖండిస్తూ విద్యార్థులు, అంగన్‌వాడీల ర్యాలీ


సోమందేపల్లిలో మానవహారంగా ఏర్పడిన అంగన్‌వాడీలు


హిందూపురంలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

హిందూపురం(సోమందేపల్లి), ఆగస్టు 21: కోలకత్తాలో వైద్యురాలిని కిరాతకంగా హతమార్చిన దోషులను కఠినంగా శిక్షించాలని అంగన్‌వాడీలు డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని అంబేడ్కర్ కూడలివద్ద మానవహారంగా ఏర్పడి ప్లకార్డులు పట్టుకుని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కార్యకర్తల సంఘం నాయకురాలు శ్రీదేవి మాట్లాడుతూ ప్రభుత్వం ఎన్ని కొత్తచట్టాలు తెచ్చినా చిన్నారులు, మైనర్లపై లైంగిక దాడులు ఆగకపోవడం దారుణమన్నారు. పశ్చిమ బెంగాల్ ఘటన మహిళా లోకానికే సిగ్గుచేటన్నారు. కఠిన శిక్షలతోనే ఇలాంటి వాటికి అడ్డుకట్ట వేయవచ్చన్నారు.

అగళి : కలకత్తాలో వైద్యురాలిపై అత్యాచారం, హత్యకు పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని అంగనవాడీ డిమాండ్ చేశారు. స్థానిక బస్టాండ్‌లో వారు మానవహారంగా ఏర్పడి నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆయాలు, కార్యకర్తలు, అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

గోరంట్ల : ప్రజల ప్రాణాలు కాపాడే వైద్యురాలిపై జరిగిన దుర్ఘటనపై యావత్ ప్రపంచం సిగ్గుతో తలదించుకోవాల్సి వస్తోందని ఉదయ్‌కిరణ్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు మధుసూధన్ ఆవేదన వ్యక్తం చేశారు. పాఠశాల విద్యార్థులు గోరంట్ల ప్రధాన రహదారిపై నుంచి గాంధీ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

చిలమత్తూరు : కలకత్తాలో వైద్యురాలిపై కిరాతకాన్ని ఖండిస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలు పెద్ద ఎత్తున నిరసన చేపట్టారు. మహిళలను కామాంధుల నుంచి రక్షించాలని, స్త్రీలకు హాని తలపెట్టే వారిపై కఠినంగా శిక్షించాలని వారు డిమాండ్ చేశారు. సీఐటీయూ నాయకులు ప్రవీణ్, వెంకటేశ్, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

హిందూపురం అర్బన్ : మహిళలు, బాలికలపై అత్యాచారాలు, హత్యలు చేసిన వారికి వెంటనే శిక్ష పడేలా చట్టాలు తీసుకురావాలని విద్యార్థినీలు పేర్కొన్నారు. ఆల్వేస్ హెల్ప్ ఫర్ అదర్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వైద్యురాలి హత్యను నిరసిస్తూ విద్యార్థులు సంఘీభావ ర్యాలీచేపట్టారు బుధవారం పట్టణ పరిధిలోని చిన్నమార్కెట్, పొట్టి శ్రీరాములు సర్కిల్ నుంచి ఎంఎఫ్‌రోడ్డు, అంబేద్కర్ సర్కిల్ మీదుగా మేళాపురం తెలుగుతల్లి విగ్రహం వరకు వేలాది మంది విద్యార్థులు ర్యాలీగా తరలివచ్చారు. కార్యక్రమంలో ఎన్‌లైట్ కళాశాల విద్యార్థులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


గోరంట్లలో ఉదయ్‌కిరణ్ పాఠశాల విద్యార్థులు

కంకర రోడ్లపై ప్రయాణం.. నరకం


కంకరతేలిన రోడ్డుపైనే ప్రయాణిస్తున్న విద్యార్థులు

పెనుకొండ రూరల్, ఆగస్టు 21 : మండలంలో ఇటీవల కురుస్తున్న వర్షాలకు రహదారులు అధ్వానంగా మారుతున్నాయి. వైసీపీ ప్రభుత్వ హయాంలో 2019-20 సంవత్సరంలో మున్సిపల్ ఎన్నికలు నిర్వహించారు. పెనుకొండ నగర పంచాయతీలో భాగంగా కోనాపురం, మంగాపురం, కొండాపురం, వెంకటరెడ్డిపల్లి, తిమ్మాపురం, ఇస్లాపురం గ్రామాలను విలీనం చేశారు. విలీనం అయినప్పటికీ ఆయా గ్రామాల అభివృద్ధిపై నాటి ప్రభుత్వం దృష్టి పెట్టలేదు. పెనుకొండ పట్టణం నుంచి కోనాపురం వెళ్లే రహదారి అభివృద్ధికి రూ.2కోట్ల నిధులు మంజూరయ్యాయిన నగర పంచాయతీ అధికారులు ఐదేళ్ల నుంచి చెబుతూనే ఉన్నారు. అయితే మరమ్మతులు చేసిన పాపానపోలేదు. ఇటీవల కురిసిన వర్షాలకు కోనాపురం రహదారి కంకరతేలి బురదమయం కావడంతో వాహనదారులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నారాయణమ్మ కాలనీ, పరిటాల డిగ్రీ కళాశాల రహదారుల్లో మోకాళ్లలోతు గుంతలు ఏర్పడి కంకర తేలింది. దీంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు, పాలకులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.


మంగాపురంలో బురదమయమైన రోడ్డు

నడిరోడ్డుపై గోతులతో ప్రమాదాలు

హిందూపురం అర్బన్, ఆగస్టు 21: పట్టణంలో రహదారుల్లో గోతులతో వాహనదారులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. స్థానిక ధర్మపురంలోని బైపాస్ రోడ్డులో మున్సిపల్ కార్యాలయానికి సమీపంలో రహదారిపై అతి పెద్ద గోతి ఏర్పడింది. తరచూ ఇక్కడ వాహనదారులు అదుపు తప్పి ప్రమాదానికి గురవుతున్నారు. బుధవారం సైతం ఇక్కడ ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న దంపతులు గుంతను గమనించకపోవడంతో అదుపు తప్పి కింద పడ్డారు. గమనించిన స్థానికులు వారిని ఆస్పత్రికి తరలించి చికిత్స అందజేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రహదారికి మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.


నడి రోడ్డులో ఏర్పడిన పెద్ద గుంత


స్థలాన్ని పరిశీలిస్తున్న ఎంపీ పార్థసారథి

కల్యాణ మండప నిర్మాణానికి స్థల పరిశీలన

హిందూపురం(పరిగి), ఆగస్టు 21: మండల కేంద్రంలో వాల్మీకి కల్యాణమండప నిర్మాణానికి ఎంపీ బీకే పార్థసారథి బుధవారం స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాల్మీకులకు కల్యాణమండపం నిర్మిస్తామని, గత టీడీపీ ప్రభుత్వంలోనే హామీ ఇచ్చామన్నారు. హామీ మేరకు రూ.కోటి నిధులతో త్వరలోనే కల్యాణమండపం నిర్మిస్తామన్నారు. దీని కోసం స్థల పరిశీలన చేపట్టినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈశ్వరప్ప, శ్రీనివాసరెడ్డి, నరసింహప్ప, సురేష్, మహేష్, తదితర టీడీపీ నాయకులు, కార్యకర్తలు వాల్మీకి సంఘం సభ్యులు ప్రజలు పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే రాక

రొళ్ల, ఆగస్టు 21: మండలంలోని ఎం.రాయాపురం గ్రామానికి ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి గురువారం రానున్నారు. పర్యటన వివరాలను టీడీపీ మండల కన్వీనర్ దాసిరెడ్డి, టీఎన్‌టీయూసీ రాష్ట్ర కార్యదర్శి గురుమూర్తి, ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు కృష్ణమూర్తి తెలిపారు. వాంతులు, విరేచనాలతో అస్వస్థతులైన బాధితులను వారు పరామర్శిస్తారని వారు తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

హిందూపురం అర్బన్, ఆగస్టు 21: పట్టణ పరిధిలోని చిన్నమార్కెట్ బాలికల జూనియర్ కళాశాలలో అతిథి అధ్యాపక పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ అనురాధ ప్రకటించారు. హిందీ, హిస్టరీ, సివిక్స్(ఉర్దూమీడియం) అధ్యాపక పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామన్నారు. అభ్యర్థులు ఎంఏ ఉత్తీర్ణులై ఉండాలన్నారు. ఈ నెల 24వ తేదీలోగా కళాశాల తమ బయోడేటాతో పాటు ధ్రువీకరణ పత్రాలు అందించాలన్నారు. 24వ తేదీ మధ్యాహ్నం 12 గంటలకు అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తామన్నారు.

గ్రామసభలను విజయవంతం చేయండి: ఎంపీడీఓ

అగళి, ఆగస్టు 21 : ఈనెల 23న జరిగే గ్రామసభలను విజయవంతం చేయాలని ఎంపీడీఓ రవిప్రసాద్ పేర్కొన్నారు. అగళి మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం అన్ని శాఖల అధికారులతో ఆయన సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. డిప్యూటీ ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆదేశాల మేరకు జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పనులపై చర్చించారు. జాబ్‌కార్డు ఉన్న ప్రతి కూలీకి న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఎస్ఐ బాధ్యతల స్వీకరణ

హిందూపురం(పరిగి), ఆగస్టు 21 : మండల పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐగా రంగడు యాదవ్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్రమ మద్యం, మట్కా, జూదం, ఇసుక రవాణా తదితర అసాంఘి కార్యకలాపాలపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఎక్కడైనా అసాంఘిక చర్యలకు ఎవరైనా పాల్పడితే తన దృష్టికి తీసుకురావాలన్నారు. అనంతరం స్థానిక టీడీపీ నాయకులు, స్టేషన్ సిబ్బంది ఆయనకు అభినందనలు తెలిపారు.


ఎస్ఐ రంగడు

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గోరంట్ల, ఆగస్టు 21: మండలంలో గురువారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 2గంటలవరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏఈ క్రిష్ణ శ్రీనివాస్ తెలిపారు. విద్యుత్ మరమ్మత్తుల కారణంగా పుట్టపర్తి సబ్‌స్టేషన్‌నుంచి మెయిన సప్లై లేని కారణంగా గోరంట్లలో విద్యుత్ సరఫరాలో అంతారాయముంటుందన్నారు. ప్రజలు ఈవిషయాన్ని గుర్తించి సహకరించాలన్నారు.

బైక్, కారు ఢీ.. ఒకరికి గాయాలు

హిందూపురం(సోమందేపల్లి), ఆగస్టు 21: మండల పరిధిలోని నల్లగొండ్రాయనపల్లి జాతీయ రహదారిపై బైక్‌ను కారు ఢీకొన్న ప్రమాదంలో హరీష్ అనే చేనేత కార్మికుడు తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు బుధవారం సోమందేపల్లికి చెందిన హరీష్ బియ్యం కోసం నల్లగొండ్రాయనపల్లికి వెళ్లి తిరిగి వస్తున్నారు. సోమందేపల్లి సమీపంలోని మలుపులో వెనుక నుంచి కారు బలంగా ఢీకొనడంతో తలకు, కాళ్లకు తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రుడిని పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా మెరుగైన వైద్యం కోసం పుట్టపర్తికి తరలించారు.


గాయపడ్డ చేనేత కార్మికుడు హరీష్

భార్య పుట్టింటికి వెళ్లిందని ఆత్మహత్య

గుడిబండ, ఆగస్టు 21 : పుట్టింటికి వెళ్లిన భార్య తిరిగి రాలేదని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్ఐ చంద్రశేఖర్ తెలిపిన వివరాల మేరకు మండలంలోని ముతుకూరు గ్రామానికి చెందిన బేబి అలియాస్ తిమ్మరాజు(33)అనే వ్యక్తి బుధవారం ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. భార్య సువర్ణ కంబదూరులో ప్రసవం కోసం వెళ్లింది. ప్రసవం అయి ఐదునెలలైనా తిరిగి రాకపోవడంతో మనస్థాపంతో ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకుని మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం మడకశిర ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కడుపునొప్పి తాళలేక విద్యార్థి ..

గుడిబండ, ఆగస్టు 21: మండలంలోని ఎస్.రాయాపురం లో విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు గ్రామానికి చెందిన శివన్న కుమారుడు హనుమంతరాయ(15) బుధవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుతున్నాడు. బుధవారం పాఠశాలకు వెళ్లిన విద్యార్థి కడుపునొప్పి అధికమయ్యిందని ఇంటికి వచ్చాడు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో దూలానికి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కూలి పనికి వెళ్లిన తండ్రి ఇంటికి రాగానే కుమారుడి మృతదేహాన్ని చూసి బోరున విలపించారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరకున్నారు. తరచూ కడుపునొప్పి, అనారోగ్యంతో బాధ పడేవాడని తండ్రి పోలీసులకు తెలిపారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మునిప్రతాప్ తెలిపారు.


హనుమంతరాయ (ఫైల్)

విద్యార్థి అదృశ్యం

లేపాక్షి, ఆగస్టు 21 : విద్యార్థి అదృశ్యంపై తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కల్లూరు గ్రామానికి చెందిన శివశంకర్‌రెడ్డి కుమారుడు హరినాథ్‌రెడ్డి హిందూపురం నారాయణ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. మంగళవారం కళాశాలకు వెళ్లి ఇంటికి తిరిగి రాలేదు. బుధవారమైనా రాకపోవడంతో తండ్రి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆచూకీ తెలిస్తే సమాచారం ఇవ్వాలని తెలిపారు.


హరినాథ్‌రెడ్డి

ఎస్సీలను అన్ని విధాలా అణిచివేశారు

అగళి, ఆగస్టు 21 : రాష్ట్రంలో ఎస్సీలను అన్ని విధాల అణిచివేశారని మాలమహానాడు నాయకులు వెంకటస్వామి నారాయణప్ప తదితరులు వాపోయారు. రిజర్వేషన్ల పేరుతో ఎస్సీలను ముంచేస్తున్నారని వాపోయారు. రిజర్వేషన్లకు వ్యతిరేకంగా ఇన్‌చార్జ్ తహసీల్దార్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. మాలమహానాడు నాయకులు వారి వెంట ఉన్నారు.